తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
07, జూలై, 2026



















## ఎస్ఐఆర్ పై అప్రమత్తంగా ఉండండి..

- బిఎల్ఓల పనితీరు అధ్వాన్నం..
- ఓటర్లకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలం..
- జూలై 12న పటాన్చెరులో మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన..
- ఎస్ఐఆర్, బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ పై అవగాహన సదస్సు..
- పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, జులై 6(జనంసాక్షి):** కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంలో ఓటర్లకు అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని.. అర్హులైన ఓటరు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి.. అర్హులైన ప్రతి ఓటు ఎస్ఐఆర్లో నమోదు చేయించాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్, బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ అంశాలపై బిఎల్ఏలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న పటాన్చెరులోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీష్‌రావు ముఖ్యఅతిథిగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

*మిగతా 13లో..*

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 6(జనంసాక్షి):** ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలకు పరిష్కారం లభించనప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఆశ్రయించాలని ప్రజలకు సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా పోలీసు కార్యాలయం ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తోందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# కుక్కలు, పిల్లులు, కోతులు కరిస్తే నిర్లక్ష్యం చేయవద్దు

**- ప్రపంచ జూనాటిక్ దినోత్సవ అవగాహన కార్యక్రమం**

**- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.కృష్ణ**





**నాగర్ కర్నూల్, జూలై 6 (జనంసాక్షి):** కుక్కలు, పిల్లులు, కోతులు తదితర జంతువులు కరిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సబ్బు నీటితో శుభ్రంగా కడిగి దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఆంటీ రేబీస్ టీకాలను వేయించుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే .కృష్ణ తెలిపారు. సోమవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా వెటర్నరీ మరియు పశు సంవర్ధక శాఖ కార్యాలయ ప్రాంగణంలో ప్రపంచ జూనోటిక్ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి సోకకుండా ఏఆర్ వి టీకాలను పశుసంవర్ధక శాఖ వారు వేశారు. అదేవిధంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖడాక్టర్లకు మరియు ఇతర సిబ్బందికి, పెంపుడు కుక్కల యాజమాన్యానికి రేబిస్ వ్యాధి సోకకుండా ఆంటీ రేబిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కే.కృష్ణ మాట్లాడుతూ జంతువుల ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రేబిస్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, కోవిడ్ 19, ఆంత్రాక్స్, లెప్టో స్పైరోసిస్ తదితర అంటువ్యాధులు కలుగుతాయని కావున ముందస్తు జాగ్రత్తల ద్వారా వీటిని నివారించాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ జంతువుల కాటును నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సబ్బు నీటితో తో 15 నిమిషాలు శుభ్రంగా కడిగి, దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుని సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో ఏ ఆర్ వి టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జంతువులను తాకిన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బు నీటితో కడుక్కోవాలి, పెంపుడు కుక్కలు, పిల్లులకు పశు సంవర్ధక శాఖ వైద్యుల సూచనలు మేరకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి, పాలను వేడి చేసిన తర్వాతనే తాగాలి, పచ్చి గుడ్లను తినరాదు, గుడ్లను, మాంసాన్ని ఉడికించిన తర్వాత మాత్రమే భుజించాలని డి ఎం హెచ్ ఓ డాక్టర్ కే కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, డిపిఓ రేణుయ, ఎం ఎల్ హెచ్ పిలు డాక్టర్ సాయి కంఠ, డాక్టర్ సాయి శ్రీ, ఎం పి హెచ్ ఈ ఓ ఫసియుద్దిన్, ఏఎన్ఎంలు శారద, అలివేలమ్మ, ఆశా కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అమరచింత హైస్కూల్ పాత భవనం కూల్చివేయాలని అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్‌కు వినతి



**అమరచింత, జులై 6(జనంసాక్షి):** సోమవారం వనపర్తి జిల్లా ప్రజావాణిలొ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్ మండల అధ్యక్షులు కె. శంకర్.లు మాట్లాడుతు.. గత 50సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతన భవనం కావడంతోజూన్ 28న అమరచింత గ్రామానికి చెందిన పగుడాకుల పవన్ కుమార్ అనే విద్యార్థి పాత భవనం కింద కూర్చొని సెదతీరుతుశీడగా పాత స్కూల్ సజ్జా కూలి ఆ విద్యార్థికి ఎడమ కాలుకు తీవ్రగాయాలు అయ్యి ప్రవేట్ హాస్పిటల్ లో లక్షలు ఖర్చు పెట్టుకుని తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్తి వైద్య ఖర్చులకు అయ్యే వ్యయంను ప్రభుత్వ భరించాలని డిమాండ్. చేశారు. ఆ పురాత భవనంను వెంటనే కూల్చివేతకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్కూలు ఆవరణలో వాకర్స్ వందలాది గా వస్తూ పోతూ ఉంటారని ఈ తరుణంలో భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాకాధికారులు స్పందించి పాత పురాతన స్కూల్ బిల్డింగును కూల్చివేసి ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం నూతన భవనంలో స్కూలు కొనసాగుతున్నందున ఇక పాత స్కూల్ బిల్డింగ్ వెంటనే కూల్చేయాలని డిమాండ్ చేశారు.గాయపడిన విద్యార్థిని కుటుంబాన్ని ఆర్థికంగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఆదుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఇదివరకే ప్రభుత్వ అధికారులు విద్యాశాఖ అధికారుల పర్యటన సందర్భంగా శ్రీఅనేకసార్లు ఈ సమస్యపై విన్నవించిన స్పందించకపోవడంతో ఈరోజు ప్రజావాణిలో మీకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చరణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల సంక్షేమం పిఆర్‌టియుతోనే సాధ్యం

**- పిఆర్‌టియు టీఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి**




**మక్తల్, జూలై 06 (జనంసాక్షి):** పిఆర్టియు టిఎస్ మక్తల్ మండల శాఖ అధ్యక్షులు గోపాల్ రెడ్డి ప్రధాన కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలో, మండలంలోని పాఠశాలలలో పిఆర్టియు టీఎస్ 2026 -2027 విద్యా సంవత్సరానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ అధ్యక్షులు మాట్లాడుతూ అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యల సాధన పిఆర్టియుతోనే సాధ్యమవుతుందని అన్నారు. బతకలేని బడిపంతులు స్థాయి నుండి అనేక సౌకర్యాలను తీసుకొచ్చిన సంఘం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కొంత నిర్లక్ష్యం కారణంగా పి.ఆర్.సి, డి ఏ లు, బిల్లులు పెండింగ్లో పెట్టడం సగటు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా పరిణమిచ్చిందని అన్నారు. ప్రభుత్వము వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్తో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ ను అమలు చేసి అన్ని రకాల ప్రమోషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘపక్షాన పెద్ద ఎత్తున ఉద్యమ బాట పడతామని ఉపాధ్యాయులు అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంలు వెంకటయ్య, లలిత, పి ఆర్ యు టి ఎస్ మాజీ మక్తల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అసోసియేటర్ అధ్యక్షులు శ్రీనివాసరావు, గాయత్రి రమేష్, బాలరాజ్, కే శ్రీనివాస్, శివ శంకర్, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందము పాల్గొన్నారు.

# చంద్రఘడ్ లిఫ్ట్ మరమ్మత్తుల పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి వాకిటి శ్రీహరి రాక



**అమరచింత, జూలై 6 (జనంసాక్షి):** మండల పరిధిలోని చంద్రగడ్ లిఫ్ట్ ద్వారా నీరు అందించేందుకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మత్స్య క్రీడల శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి రానున్నారు. ఆయన రైతుల కోసం లిఫ్ట్ మరమ్మత్తు పనుల కోసం రెండు కోట్ల రూపాయలు కేటాయించి ఈ లిఫ్టును బాగు చేయడానికి కేటాయించడం జరిగింది. రైతులకు నీరు ఉంటే సొంత ఊర్లో వ్యవసాయం చేసుకోవడానికి పని ఉంటది కనుక పంటలు పండుతే రైతు, రైతు కూలీలు బాగుపడతారని. మన ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు.అందు నిమిత్తమే ఈ చంద్రఘడ్ లిఫ్టు మంగళవారం ఉదయం 10. 00 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి తెలిపారు . వారి వెంట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్ అమరచింత పట్టణ అధ్యక్షులు రవికాంత్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**అడ్డాకుల, జులై 6 (జనంసాక్షి):** అడ్డాకుల మండల కేంద్రంలోని టోల్ ప్రజా సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో కాటవరం గ్రామానికి చెందిన ఎరుకలి బాబు 35 సంవత్సరాలు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు పోలీసుల కథనం ప్రకారం సోమవారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టీవీఎస్ ఎక్సెల్ పై ప్రయాణిస్తున్న ఎరుకలి బాబుతో పాటు మరో వ్యక్తిని ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో ఎరుక లి బాబు ఘటన స్థలంలోనే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని 108 అంబులెన్స్ లో జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు అడ్డాకుల ఎస్సై మురళి తెలిపారు .మృతుడి టోల్ ప్లాజా సమీపంలో హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

# నేడు అచ్చంపేటలో మెగా కంటి వైద్య శిబిరం

**- తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉచిత కంటి శస్త్రచికిత్స**






**అచ్చంపేట, జులై 6 (జనంసాక్షి):** పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆధ్వర్యంలో, శ్రీ మహాలక్ష్మి మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ (ఈహెచ్ఎస్) సహకారంతో జూలై 7వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు పబ్లిక్ క్లబ్, అచ్చంపేట అధ్యక్షులు అంగిరేకుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యుల బృందం కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించనుంది. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ప్రత్యేకంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి కంటి శస్త్రచికిత్స అవసరమైతే పూర్తిగా ఉచితంగా నిర్వహించబడుతుందని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్యం అందుబాటులోకి రానుంది. ఇట్టి ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉచిత సేవలను వినియోగించుకోవాలని పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తా

**- వివాహ శుభకార్యానికి ఆర్థిక సహాయం**

**- బిఆర్ఎస్ నాయకులు తలారి శ్రీనివాస్**



**వట్టిపల్లి, జులై 6 (జనంసాక్షి):** సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ తాను గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తానని వట్పల్లి మండల బిఆర్ఎస్ నాయకులు బూత్కూర్ తలారి శ్రీనివాస్ అన్నారు. గత సర్పంచి ఎన్నికల్లో గ్రామంలో నూతనంగా పెళ్లి చేసుకున్న వధువుకు రూ.5,011 రూపాయలు పెళ్లి సమయంలో ఇస్తానని హామీలో భాగంగా బూత్కూర్ గ్రామానికి చెందిన పల్లి లక్ష్మయ్య కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో కొత్తగా వివాహం చేసుకునే వధువుకు తన వంతు సహకారం అందజేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

# కరువు తీరాలి... వర్షాలు కురవాలి

- కృష్ణమ్మ జలాలతో గ్రామదేవతలకు బిజ్జారం గ్రామస్తుల ప్రత్యేక పూజలు



**గద్వాల, జులై 6 (జనంసాక్షి):** తెలంగాణలోని గద్వాల జిల్లా, మల్దకల్ మండలం బిజ్జారం గ్రామస్తులు వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుబడులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సమీపంలోని కృష్ణానదికి వెళ్లి, భక్తిశ్రద్ధలతో నది జలాలను బిందెలలో తీసుకువచ్చి, గ్రామంలోని గ్రామదేవతలకు విశేష పూజలు మరియు అభిషేకాలు నిర్వహించారు. వరుణ దేవుని అనుగ్రహం కోసం ఇలాంటి ప్రత్యేక పూజలు చేయడం వారి నమ్మకం.సహజంగా గ్రామీణ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు లేదా వానలు ఆలస్యమైనప్పుడు, ప్రకృతిని మరియు దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి ఇలాంటి సంప్రదాయ పూజలు చేస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, చెరువులు, కుంటలు నిండి, వ్యవసాయ పనులు సజావుగా సాగాలని గ్రామ రైతులు ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడతారు. సాధారణంగా నైరుతి రుతుపవనాల కాలంలో వర్షాలు ఆలస్యం అయినప్పుడు లేదా కరువు ఛాయలు కమ్ముకున్నప్పుడు, వివిధ ప్రాంతాలలోని రైతులు తమ నమ్మకాల ప్రకారం ఈ తరహా ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహిస్తుంటారు.

# ఒక్కరోజు సెలవు లేదు.. సమయపాలనలో సాటిలేదు

- కొండపల్లి విద్యార్థిని ప్రసన్నకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ప్రశంసా పత్రం



**గద్వాల, జులై 6 (జనంసాక్షి):** 100% హాజరు, అద్భుతమైన సమయపాలన విద్యార్థిని ప్రసన్నకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుల ప్రశంసా పత్రం అందజేత, జూన్ 2025 నుండి మార్చి 5, 2026 వరకు ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా, నిరంతరాయంగా పాఠశాలకు హాజరవుతూ అద్భుతమైన సమయపాలన ప్రదర్శించిన గద్వాల మండలం కొండపల్లి ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థిని ప్రసన్నను రాష్ట్ర ప్రభుత్వం అభినందించింది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ జారీ చేసిన ప్రత్యేక అభినందన పత్రాన్ని సోమవారం పాఠశాల ఉదయం ప్రార్థన సమయంలో ప్రసన్నకు ఘనంగా అందజేశారు.ఆదర్శవంతమైన క్రమశిక్షణ దాదాపు పది నెలల పాటు నిరంతరాయంగా బడికి వస్తూ, సమయపాలనలో తోటి విద్యార్థులకు ప్రసన్న రోల్ మోడల్‌గా నిలిచింది.ప్రసన్న చూపిన శ్రద్ధ, క్రమశిక్షణను ఉపాధ్యాయులు ప్రార్థన సమావేశంలో ప్రత్యేకంగా కొనియాడారు.రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారి నుండి అభినందన పత్రం అందుకోవడం పట్ల ప్రసన్న, ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇది మిగిలిన విద్యార్థులలో కూడా బడికి క్రమంగా వచ్చేలా స్ఫూర్తిని నింపుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# విరసం ఆవిర్భావ సభను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడాన్ని ఖండించండి

- తెలంగాణ ప్రజాఫ్రంట్, పౌర హక్కుల సంఘం

**గద్వాల నడిగడ్డ, జులై 6(జనంసాక్షి);** ఫాసిజం, ప్రజలపై నిర్బంధం అంశాలతో విప్లవ రచయితల సంఘం ఆవిర్భావదినమైన ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో హాలుకే పరిమితమై నిర్వహించుకోదలచి సన్నద్దమైన సభను రాష్ట్ర పోలీసులు అడ్డుకోవడాన్ని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర ప్రభాకర్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండి సుభాన్ తీవ్రంగా ఖండిస్తున్నామని వారు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 25, 2026న కూడా ఎమర్జెన్సీ విధించిన చీకటిరోజు సందర్భాన్ని గుర్తుచేస్తూ పౌరహక్కుల సంఘం నిర్వహించదలిచిన సభను పోలీసులు ఇదే వైఖరితో అడ్డుకోవడం చూసామనీ, తెలంగాణలో ప్రజాపాలన అందిస్తున్నామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పదేపదే మాట్లాడుతూ మరొకవైపు సభలు సమావేశాలను వారి పోలీసులు అడ్డుకొనే ద్వంద వైఖరిపై ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విధంగా సభలు, సమావేశాలను అడ్డుకోవడం భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని తెలంగాణ ప్రజాఫ్రంట్, పౌర హక్కుల సంఘం భావిస్తున్నదని, భావాలను వ్యక్తీకరణ చేసేటువంటి హక్కును, మాట్లాడే హక్కును,ప్రశ్నించే హక్కుల గొంతునొక్కటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని టీపీఎఫ్, పౌర హక్కుల సంఘం నాయకులు పేర్కొన్నారు. గత 10 సంవత్సరముల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కూడా హక్కులను హరింప చేసిందని, వారికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా పడుతుందని, అరిచేతినీఅడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం పోకడ చూస్తుంటే ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంకి ప్రజలే గుణపాఠం చెప్తారని, నాజిల మించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని రేవంత్ రెడ్డి నడుపుతున్నాడని, సభలు సమావేశాలు పెట్టుకునే హక్కు ప్రజలకు ఉంటుందని ప్రజలను విస్మరిస్తే పాతాళానికి తొక్కుతారని ఈ సందర్భంగా వారు అన్నారు.

# యాష్ ట్యాంకర్లతో ప్రమాదం... ప్రజలకు ముప్పు

- ఓవర్ లోడ్‌తో కూడిన బూడిదలతో భారీ వాహనాలు
- కృష్ణ మండలం బిజెపి అధ్యక్ష నల్లే నరసప్ప





**కృష్ణ, జూలై 6 (జనంసాక్షి):** రాష్ట్ర సరిహద్దులోని శక్తినగర్ థర్మల్ పవర్,విద్యుత్ కేంద్రం నుండి తరలిస్తున్న యాష్ బూడిద, ట్యాంకర్ల వల్ల ప్రమాదం ముంచుకున్నదని ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందని ప్రజలు, ప్రయాణికులు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము, దూళితో కప్పబడి ఉన్న కర్ణటక దేవసుగుర్. పవిత్ర క్రిష్ణ నదిలో స్నానం ఆచరించి, పుణ్య క్షేత్రం శ్రీ సూగురేశ్వర స్వామి దర్శించుకోవడానికి ఉమ్మడి పాలమూరు జిల్లా నుండి అనేక వేలాది మంది భక్తులు వస్తుంటారు. మక్తల్ నియోజకవర్గంకు అనుకోని ఉన్న రాయచూరు జిల్లా కేంద్రానికి అనేక ఆరోగ్య, విద్య, వాణిజ్య పనులపై వేలాది మంది ప్రయాణికులు కృష్ణ బ్రిడ్జ్ దేవసుగుర్ పైనుండి రాయచూరు వెళ్తుంటారు. కేపిసిఎల్ ఫ్యాక్టరీ నుండి రోజు వందలాది యాష్ ట్యాంకర్లు లోడ్ లతో ఓవర్ స్పీడ్‌తో సరిగ్గా బాడీ కవర్ తాడపత్రి తప్పకుండా దుమ్ము దుమారంతో ర్యాష్‌గా, (ఓవర్టేక్ తో) వస్తున్నాయని, బ్రిడ్జ్ మీద, బైక్ పైన వెళ్తున్న ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపణలు కూడా వస్తున్నాయని, కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా క్రిష్ణ మండలం గుడేబల్లూర్, టై రోడ్, హిందుపూర్, కున్సి,మీదుగా వెళ్తు రోడ్లల్లో దుమ్ము, దూళి వదులుతూ పోతుంటాయి. అటు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాల ప్రయాణికులు అనేక రకాల కంటి వ్యాధులతో బాధపడుతున్న, ఎన్నో ప్రమాదాలు జరుగుతున్న సరిహద్దు రెండు రాష్ట్రాల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్ ప్రశ్నర్థకం..? అవుతుందనీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆలోచించి తగిన పరిష్కారం కొరకు కృషి చేయాలనీ కృష్ణ మండలం బిజెపి అధ్యక్షుడు నల్లె నరసప్ప కోరుతున్నారు.

# కొమురవెల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చి సరిపోను సిబ్బందిని నియమించాలి

- ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి



**కొమురవెల్లి, జూలై 6(జనంసాక్షి):** కొమురవెల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ ని 24 గంటలు పని చేసే విధంగా మార్చి దానికి సరిపోను సిబ్బందిని నియమించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సత్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రోజున పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ హాస్పిటల్‌ని మెరుగుపరచామని సరిపోను సిబ్బందిని నియమించామని ఎటువంటి కొరత లేకుండా డాక్టర్ చూస్తున్నారని గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ ఆచరణలో ఎక్కడ అమలు కావడం లేదని ఆయన అన్నారు కొమురవెల్లి ప్రభుత్వ దావకానాలో కనీసం అటెండర్ లేక స్వీపర్ లేక ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉన్నదని దానితో హాస్పిటల్ లో పనిచేసే ఇతర సిబ్బంది దాన్ని తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడ్డదని దావఖానాలో ఉన్నటువంటి బెడ్స్ క్లీన్ లేకపోవడంతో దానిపైన పడుకునే పేషంట్లకి కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో 11 గ్రామాలకు గాను ముగ్గురు సెకండ్ ఏఎన్ఎంలో ఉన్నారని మరి ముత్యాల ఐనాపూర్ సబ్ సెంటర్లలో ఉండాల్సిన MLHP, పోస్టులను పోస్టులను భర్తీ చేయాలని పిహెచ్‌సి నర్సింగ్ పోస్టులను రెగ్యులర్ ఏఎన్ఎం లను నియమించాలని ఖాళీగా ఉన్నా పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొమురవెల్లి జాతరకు లక్షలాదిమంది ప్రజలు వచ్చిపోతుంటారు వారికి ప్రమాదాలు జరిగితే దగ్గరలో 24 గంటల ఆసుపత్రి లేకపోవడంతో ప్రైవేట్ ఆర్ఎంపీలు సంప్రదించాల్సిన పరిస్థితి వస్తుందని వాళ్లకు వచ్చి రాణి వైద్యంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయ ని కొమురవెల్లి ప్రభుత్వ దావకానని 24 గంటల దావకానగా మార్చి సరిపోను సిబ్బందిని నియమించి ఇక్కడ ప్రజలకి జాతరకు వచ్చే ప్రజలకి వైద్యాన్ని మెరుగుపరచాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపాడుగా కృష్ణారెడ్డి మండల కార్యదర్శి తాడూరి రవీందర్ మండల కమిటీ సభ్యులు నాయకులు తేలు ఇస్తారి బక్కిలి బాలకిషన్ ఉల్లంపల్లి సాయిలు పకనాటి బాలు గాంధారి శ్రావణ చారి ఆరుట్ల దయానందు పబ్బోజు నవీన్ కనుకయ్య తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ రైతుల రహదారిని ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని డిప్యూటీ కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు



**చౌట్కూర్, జులై 06 (జనంసాక్షి):** చౌట్కూర్ గ్రామ శివారులో ఉన్న ఎం.పీ.ఈ డిస్టిలరీ సంస్థతో పాటు సమీపంలో అభివృద్ధి చేస్తున్న వెంచర్ యాజమాన్యం, గ్రామస్తులు దశాబ్దాలుగా పంట పొలాలకు వెళ్లేందుకు వినియోగిస్తున్న రహదారిని కాంపౌండ్ వాల్ నిర్మించి ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ, ఆ అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని సరాపల్లి గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం, రైతులు కలిసి సంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ, సుమారు 50 సంవత్సరాలుగా రైతులు, గ్రామస్తులు ఉపయోగిస్తున్న పంట పొలాల రహదారిని ఎం.పీ.ఈ డిస్టిలరీ సంస్థ, కొత్తగా ఏర్పాటు చేస్తున్న వెంచర్ యాజమాన్యంతో కలిసి కబ్జా చేస్తూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. డిస్టిలరీ సంస్థ స్థాపించినప్పటి నుంచే పరిసర ప్రాంతాల రైతులు, గ్రామస్తులు కాలుష్య సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పుడు రహదారిని కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. గతంలో కూడా ఈ నిర్మాణాలను నిలిపివేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు, సంబంధిత యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, స్థానిక రాజకీయ నాయకుల అండతో నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను వెంటనే నిలిపివేసి, రైతుల రహదారిని యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు.

## ధర్మపురి పాఠశాలకు రెండురోజుల్లో ఉపాధ్యాయుడి నియామకం..

**- మండల విద్యాధికారి ఎంఈవో రాజునాయక్**



**మహమ్మదాబాద్, జూలై 06 (జనంసాక్షి):** ధర్మపురి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడి నియామకంపై (ఎంఈఓ) రాజు నాయక్ స్పందించారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ..గతంలో ప్రమోషన్ల కారణంగా ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, గత విద్యా సంవత్సరంలో డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడిని నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన సొంత పాఠశాలకు వెళ్లడంతో, ప్రధానోపాధ్యాయురాలి విజ్ఞప్తి మేరకు మరో రెండు రోజుల్లో మండలంలోని ఒక పురుష ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై ధర్మపురి పాఠశాలకు పంపిస్తామని, మండల (విద్యాధికారిఎంఈఓ) రాజు నాయక్ తెలిపారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**- బడుగువర్గాల సభివృద్ధికి ఎంతో కృషి : ఎమ్మెల్యే మాణిక్ రావ్**



**జహీరాబాద్, జులై 6(జనంసాక్షి):** భారత మాజీ ఉప ప్రధాన మంత్రి, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అన్నారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పస్తాపూర్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో, సామాజిక న్యాయం సాధనలో, వెనుకబడిన వర్గాల అభ్యున్నతిలో చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా ఆయన అందించిన సేవలు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. ముఖ్యంగా హరిత విప్లవాన్ని బలోపేతం చేస్తూ రైతాంగ సంక్షేమానికి ఆయన చేసిన కృషి విశేషమని కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, దేశమంతా గర్వించదగ్గ మహోన్నత దేశభక్తుడని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరిస్తూ సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి మోహన్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివప్ప, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ప్రతి ఒక్క ఓటు నష్టపోకుండా చూడాలి

**- ఎస్ఐఆర్ కాంగ్రెస్ కన్వీనర్ కేదార్నాథ్ పాటిల్**



**రాయికోడు, జులై 6, (జనంసాక్షి):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఏలపై ఉందని ఎస్ఐఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని సంగాపూర్ ఔరంగానగర్ ఎంకేపల్లి రాయిపల్లి మామిడిపల్లి గ్రామాలలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నరసింహులుతో కలిసి సమగ్ర ఓటర్ సర్వేపై అవగాహన కల్పించారు. అర్హత గల వాళ్లందరి ఓట్లు నష్టపోకుండా చూడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్ వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి పార్టీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి,మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్, సర్పంచ్ చరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి,నజీర్, ఆర్ రాజు కురుమ, శ్రీశైలం శ్రీనివాస్, రవి పటేల్, వీరేందర్ పాటిల్, సుధాకర్, జి విటల్,జి కపిల్, లక్ష్మణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమాన్ని మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి**




**జడ్చర్ల, జూలై 6 (జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా జడ్చర్లలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ గత తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ వంటి పథకాలతో రైతన్నలకు భరోసా కల్పించామని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలను పక్కనబెట్టి, అన్నదాతలను నిలువునా ముంచుతోందని, కులరహిత, సమ సమాజ నిర్మాణమే బాబు జగ్జీవన్ రామ్ ఆశయమని, కానీ ప్రస్తుత ప్రభుత్వ చర్యలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని, రైతుల పట్ల ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసిన ఏఎంసీ చైర్మన్



**మునిపల్లి, జులై 6 (జనంసాక్షి):** రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి సోమవారం హైదరాబాదులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా పూల బొకేతో ఘనంగా సత్కరించారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఉన్నారు.

## విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

**- రైతులకు వ్యవసాయ అధికారులు సూచన**

**చౌట్కూర్, జూలై 06 (జనంసాక్షి):** రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ముఖ్యమైన హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత వానకాలం సాగు నేపథ్యంలో ప్రభుత్వం ఎంపిక చేసిన వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు, ఆ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పొలం పనులు లేదా విత్తనాల విజువల్స్ రన్ అవుతుండాలి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వరి విత్తనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారానే రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సులభంగా అందుతాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ వానకాలం సీజన్ కోసం ప్రత్యేకంగా 7 రకాల వరి విత్తనాలను ఎంపిక చేసింది.ఆ 7 రకాల విత్తనాలు బిపి టు 5204 ఆర్ ఎన్ ఆర్ 15048 కేఎన్ఎం 1638 హెచ్ఎంటి సోనా జైశ్రీరామ్ డబ్ల్యూ జి ఎల్ 44 కేఎన్ఎమ్ 7715 రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణానికి వెళ్లి, అక్కడ తీసుకున్న కొనుగోలు బిల్లును అందజేయాల్సి ఉంటుంది. ఆ బిల్లు ఆధారంగా సంబంధిత డీలర్లు విత్తనాల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. కాబట్టి చౌటకూర్ మండల రైతులు ఎలాంటి ఆలస్యం చేయకుండా, వెంటనే తమ వరి విత్తనాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు ఏవో ప్రవీణ తెలియజేశారు.

## ఆర్టీసీ బస్సులు ఆపండి.. మమ్మల్ని కాపాడండి

**- గద్వాల కలెక్టరేట్ ఎదుట పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన**

**గద్వాల, జూలై 06 (జనంసాక్షి):** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గద్వాల పట్టణానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కళాశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడం, వచ్చిన బస్సులు కూడా నిలపకుండా వెళ్లడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై విద్యార్థులు సోమవారం గద్వాల కలెక్టరేట్ గేటు ముందు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్లు ప్రత్యేక బస్సులు కళాశాల సమయాలకు అనుగుణంగా విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపాలని, బస్సు స్టాపింగ్ రాయచూర్ మార్గంలో వెళ్లే ఆర్టీసీ బస్సులను పాలిటెక్నిక్ కళాశాల వద్ద తప్పనిసరిగా ఆపాలని,ఆలస్యం హాజరు నష్టం, బస్సులు లేకపోవడం వల్ల నిత్యం తరగతులకు ఆలస్యమవుతోందని, దీనివల్ల హాజరు దెబ్బతింటుందని విద్యార్థులు వాపోతున్నారు.ఆర్థిక భారం వేరే మార్గం లేక ప్రైవేట్ ఆటోలను ఆశ్రయించి రోజూ భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై విద్యార్థులంతా కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థుల మధ్య అమృత్ జయంతి వేడుకలు



**మక్తల్, జూలై 06 (జనంసాక్షి):** మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ తనయుడు స్వర్గీయ అమృత్ గౌడ్ జయంతి వేడుకలు విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. అమృత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక స్థానిక బీసీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆమృత్ గౌడ్ చిత్రపటానికి పూల మాల వేసి వారి కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరము విద్యార్థుల మధ్య కేక్ కటింగ్ చేసి 30 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారి తల్లిదండ్రులు పి ధనలక్ష్మి నరసింహ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఏ మహిపాల్ రెడ్డి, అనుగొండ మాజీ సర్పంచి కొత్త కాపు గోవర్ధన్ రెడ్డి, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్న హనుమంతు, కే తాయప్ప, నాయకులు జుట్ల శంకరు, బండారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

## డ్రైనేజీ లేక ఏళ్ల తరబడి నరకయాతన

**- పుల్కల్ 12వ వార్డులో మురుగు నీటి సమస్య తీవ్రం.. పట్టించుకోని అధికారులు**





**పుల్కల్, జూలై 6 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని పన్నెండవ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏళ్ల తరబడి స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. సంగారెడ్డి నుంచి సింగూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే సుమారుగా యాభై కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.సుబ్బారావు ఇంటి నుంచి స్మరణ సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ వరకు ప్రధాన రహదారిని ఆనుకొని డ్రైనేజీ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇళ్ల నుంచి వెలువడుతున్న మురుగు నీరు వీధుల్లోనే నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.వర్షం కురిసినప్పుడల్లా రహదారులన్నీ మురుగునీటితో నిండిపోతుండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.అసలే వర్షాకాలం మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమల బెడద పెరిగి డెంగీ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు వాపోతున్నారు.పన్నెండవ వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని వార్డు ప్రజలు అధికారులను కోరుతున్నారు. సమస్య మరింత తీవ్రమయ్యేలోపు అధికారులు స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలి

**- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**బిజినేపల్లి, జూలై 6 (జనంసాక్షి):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా ఎరువులను సకాలంలో, పారదర్శకంగా, సమర్థ వంతంగా పంపిణీ చేయాలని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, లాభదాయకమైన కూరగాయల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం బిజినపల్లి మండల కేంద్రంలోని మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ రైతులకు యూరియా పంపిణీ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించి, రైతులతో మాట్లాడి ఎరువుల లభ్యత, పంపిణీ విధానం, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు పొందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులతో కలెక్టర్ మండలంలో ప్రస్తుతం ఉన్న యూరియా నిల్వలు, రైతుల డిమాండ్, పంపిణీ ప్రక్రియ, పంటల సాగు విస్తీర్ణం, వర్షపాతం పరిస్థితులు తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు.

వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ బిజినపల్లి మండలంలో ప్రస్తుతం మొత్తం 244 టన్నుల యూరియా నిల్వలు అందు బాటులో ఉన్నాయని, వాటిలో మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 62 టన్నుల యూరియా నిల్వ ఉందని, రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అవసరాలకు అనుగుణంగా బయోమెట్రిక్ విధానంలో పారదర్శ కంగా పంపిణీ జరుగుతోందని, ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు అదనపు నిల్వలు కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వ్యవసాయ పరిస్థితులను వివరిస్తూ, ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 12,345 ఎకరాల్లో పత్తి పంటల సాగు జరిగిందని, ఇప్పటివరకు 31 ఎకరాల్లో వరి, 45 ఎకరాల్లో మొక్కజొన్న, 79 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు ప్రారంభమైనట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసిన వెంటనే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి బస్తా అర్హులైన రైతులకే అందేలా చూడాలని సూచించారు.

ఈ ఏడాది వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే జొన్న, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు సాగు చేయడం ద్వారా వ్యయాన్ని తగ్గించుకోవచ్చని, అలాగే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న లాభదాయకమైన కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని, పంటల ప్రణాళిక, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంటడివిజన్ వ్యవసాయ శాఖ అధికారిపూర్ణ చంద్రరావు తాహసిల్దార్ మునీరుద్దీన్,డిప్యూటీ తాసిల్దార్ రవికుమార్ , మండల వ్యవసాయ అధికారులుఏవో కమల్ కుమార్ తదితరులున్నారు.

## సీఎం సహాయనిది చెక్కులను పంపిణి చేసిన కాంగ్రెస్ నాయకులు



**వీపనగండ్ల, జులై 7 (జనంసాక్షి):** వీపనగండ్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల నాయకులు అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులలో వంక శివ రూ.57,50/-మీసాల జయమ్మ రూ.54,500/-, మెకానిక్ కుర్వ రాజు, రూ.22,500/-, ఎన్.బాలీశ్వరమ్మ, రూ.22,500/- ముంత లక్ష్మి, రూ.21,000/-, కానమోని తిరుపతయ్య రూ.20,000/-, చాపల సురేష్, రూ.19,500/ తెలుగు ఈదమ్మ రూ.14,000/ తెలుగు శేషమ్మ రూ.10,000/ జుర్రు లక్ష్మీదేవి రూ.14,500/-, అమ్మపల్లి రాముడు, రూ.18,500/మొత్తం రూ.2,74,500/ విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పార్వతమ్మ, ఉప సర్పంచ్ బాల పీరు,ఇందిరమ్మ ఇళ్ల కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి,మండల రైతు కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముదిగొండ గోపి, కావలి మహేష్, సంఘం వెంకటయ్య, బీరయ్య, సర్వారెడ్డి, పెబ్బేటి మహేష్ పాల్గొన్నారు.

## మెదక్ పట్టణ రాందాస్ ఛారస్తా వద్ద ప్రమాదకరమైన గుంత



**మెదక్ మున్సిపాలిటీ జులై 06, (జనంసాక్షి):** మెదక్ పట్టణ రాందాస్ ఛారస్తా పరిసర ప్రాంతం నుంచి వాసవి నగర్ కాలనీకి వెళ్లే రద్దీ ప్రాంతంలో రహదారి మధ్య భాగంలో మురుగు కాలువ స్లాబ్ కుంగి పోవడంతో ప్రమాదకర గుంత ఏర్పడింది. దింతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై నిత్యం భారీగా రాకపోకలు సాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గుంతను రాళ్లతో తాత్యాలికంగా మూసివేసినప్పటికీ, అది సరిపోని చర్యగా స్థానికులు వెలొంటున్నారు. ముఖ్యంగా రాత్రీ వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి కుంగిపోయిన స్తాబు శాశ్వతంగా మరమ్బతు చేసి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**స్థానికుల డిమాండ్...** కుంగిపోయిన స్తాబు శాశ్వతంగా మరమ్మతు చేసే, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## జంబిగీలో పసక పండుగ



**రాయికోడు, జులై 6, (జనంసాక్షి):** మండల పరిధిలోని జంబిగి కె గ్రామంలో గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పసక పండుగ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ బీర లింగేశ్వర స్వామి, మల్లికార్జున స్వామి దేవాలయంలలో కురుమలు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. తదనంతరం బొంగుండేశ్వర విగ్రహం వద్ద సహా పంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కురుమ సంఘం పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ




**జహీరాబాద్, జూలై 6(జనంసాక్షి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహణపై జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ దశరథ్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే, దరఖాస్తుల స్వీకరణ, ఓటరు వివరాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శిక్షణలో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాయికోడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కేదార్నాథ్ పాటిల్



**రాయికోడ్, జూలై 6, (జనంసాక్షి):** రాయికోడు మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయికోడ్ గ్రామానికి చెందినపట్లోళ్ల కేదార్నాథ్ పాటిల్ ఎన్నికైనట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యాలయం నుండి సాంకేతాలు వెలువడినట్లు తెలిసింది. ఇంతకాలం మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా శంషుద్దీన్ పూర్ గ్రామం మాజీ సర్పంచ్ బాలాజీ నరసింహులు పనిచేశారు. ముందుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి చాలా మంది పోటీదారుల పేర్లు వినబడినప్పటికీ మంత్రి దామోదర్ కేదార్నాథ్ పాటిల్ పై మొగ్గు చూపినట్టు తెలిసింది, ఏది ఏమైనప్పటికీ మరొక రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి.

## విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా బస్సు సౌకర్యం కల్పించాలి

**- డిపో మేనేజర్‌కి మాజీ సర్పంచ్ రాజేందర్ వినతి**



**కౌడిపల్లి జూలై 06,(జనంసాక్షి):** అందుగులపల్లి, లింగంపల్లి, కొట్టాల గ్రామాల నుండి వెల్మకన్న గ్రామానికి పాఠశాల విద్య కోసం వచ్చే విద్యార్థులు, కౌడిపల్లి మండల కేంద్రంలోని కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, బూరగడ్డ గ్రామం నుండి వెల్మకన్న, కౌడిపల్లి మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థుల సౌకర్యార్థం స్కూలు, కాలేజీ సమయానికి అనుగుణంగా ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మెదక్ డిపో మేనేజర్ గారికి వెల్మకన్న మాజీ సర్పంచ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, బూరగడ్డ సర్పంచ్ శేకులు యాదవ్, వినతిపత్రం అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ... విద్యార్థుల సౌకర్యమే మా ప్రాధాన్యం ప్రతి విద్యార్థికి సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా అందిస్తాము అని సందేశాన్ని ఇచ్చే ప్రభుత్వ అధికారులు ఈ రోజు మారుమూల గ్రామాలలో నుండి చదువు కోవడానికి వచ్చే విద్యార్థిని విద్యార్థులకు కనీస బస్ సౌకర్యశీ లేక అంగన్వాడీ, ప్రైమరీ స్కూల్ స్థాయిలోనే చదువును ఆపేస్తున్నారని రాజేందర్ అన్నారు. ఇప్పటికే అందుగులపల్లి, లింగంపల్లి, కొట్టాల, వెల్మకన్న, బూరగడ్డ, ఇతర గ్రామాల విద్యార్థులు పైచదువులకోసం బస్ రవాణా సౌకర్యం లేక మద్యలోనే విద్యను ఆపేయాల్సిన దుస్తితి ఏర్పడిందని రాజేందర్ అన్నారు. ఇప్పటికైనా బస్ సౌకర్యం కల్పించాలని జిల్లా ఉపాధ్యక్షుడు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్ కోరారు.

# ముఖర్జీ ఆశయాలతో ముందుకు సాగాలి : ఎంపి డికే.అరుణ




**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 6(జనంసాక్షి):** జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలతో ముందుకు సాగాలని పాలమూరు ఎంపీ డికే. అరుణ కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. సోమవారం శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా నారాయణపేటలో జరిగిన బిజెపి జిల్లా సమావేశంలో ఆమె ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నారాయణపేట జిల్లా బిజెపి కార్యవర్గ సమావేశంలో జిల్లా నేతలకు,కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు.సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్,బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి, పగడాకుల శ్రీనివాస్, కొండయ్య,లక్ష్మీ కాంత్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ శ్వేతా వైస్ చైర్మన్ మంజుల,జిల్లా జనరల్ సెక్రటరీలు తిరుపతి రెడ్డి, లక్ష్మీ శ్యామ్ సుందర్, జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ అరుణ మాట్లాడుతూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ సఫారీ పరిపాలన చేస్తున్నారన్నారు.పార్టీ కార్యక్రమాలు కిందిస్థాయి వరకు తీసుకు వెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలనీ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై రాష్ట్ర ప్రభుత్వం పైఎన్ని పోరాటాలు చేసిన తక్కువేనన్నారు. క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు ఇప్పించుకుంటున్నారన్నారు. అర్హులకు ఇండ్లు వచ్చేలా బీజేపీ కార్యకర్తలు, నాయకులు పోరాటం చేయలన్నారు. పోరాటాలు చేసినప్పుడే అధికారంలోకి రావడం సాధ్యమౌతుంది. పోరాటాలు చేస్తేనే అధికారంలోకి రావడం సాధ్యం అవుతుందన్నారు. రైతులకు, మహిళలకు, యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కొట్లాడుదాం.రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తె ఏం చేస్తుందో వివరించి అన్ని వర్గాలలో విశ్వాసం నింపాలన్నారు. బీజేపీకి ప్రజలు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారనీపార్టీ కార్యక్రమాలు నిబద్ధతతో నిర్వహించాలని పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాననీ తెలిపారు.

# ఆపదలో వున్నవారికి కొండత అండ సియమ్ ఆర్ధిక భరోసా

**- 11 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..**



**జహీరాబాద్, జూలై 6(జనంసాక్షి):** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్‌లోని ఆయన నివాసంలో జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు మాజీ టీజీఐడీసీ చైర్మన్ తన్వీర్‌తో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యంతో చికిత్స పొందిన పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరించి మరిన్ని వ్యాధులకు ఉచిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అవసరమైన సమయంలో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలవడం సీఎం రిలీఫ్ ఫండ్ ప్రత్యేకత అని పేర్కొన్నారు.
సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్‌రెడ్డి, డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ యునూస్, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, జాఫర్, జావిద్, జహంగీర్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రాంచందర్, అశ్విన్ పాటిల్, సునీల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో యువ నాయకుని జన్మదిన వేడుకలు

**- అనంతరం ఫోటోను బహూకరించి శాలువాతో సన్మానం**




**రేగోడ్, జూలై06 (జనంసాక్షి):** రేగోడ్ మండల యువ నాయకులు చెన్నయ్య గారి చక్రపాణి జన్మదిన వేడుకలు మోడల్ స్కూల్,మరియు ప్రైమరీ స్కూల్,జెడ్పిహెచ్ఎస్ లో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా దాదాపు 1000 (వెయ్యి) మంది విద్యార్థులకి పైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యార్థుల సమక్షంలోనే కేకు కట్ చేసి వారితో మిఠాయిలు తినిపించుకొని ఆనందాన్ని పంచుకున్నారు.చక్రపాణి పాఠశాలలో మరియు విద్యార్థులపై చూపించిన సేవ భావానికి గాను పాఠశాల సిబ్బంది జ్ఞాపిక (ఫోటో)ని బహూకరించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ, పాఠశాల సిబ్బంది, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు చెన్నయగారి ఉపేంద్ర మరియు చక్రపాణి టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**- ఇందిరా పార్క్ మహా ధర్నాకు సిపిఐ నాయకులు**
**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్**



**సదాశివపేట, జులై 6 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం ఇందిరా పార్క్ లో జరిగే మహాధర్నకు సదాశివపేట నుంచి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా తాజుద్దీన్ మాట్లాడుతూ... గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రతి పేద వాడికి ఇంటి స్థలం ప్రతి పూరి గుడిసే వేసుకున్న వారికి పట్టాలిస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇండ్ల పట్టాలు ఇవ్వలేకపోయారని ఆరోపించారు. అధికార పార్టీ ఇచ్చిన హామీల అమలుకై ఇందిరా పార్క్ లో వామపక్ష పార్టీలతో మాహ ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. ధర్నాలో ఎంఏ రెహమాన్, ముస్తఫా, వెంకట్ గౌడ్ , జ్యోతి , సాదక్ అలీ, కళావతి, తస్లీమ్ , రాజమ్మ తదితరులు వెళ్లడం జరిగింది.

# తస్మాత్ జాగ్రత్త... ఓటు పోతే మళ్ళీ రావడం కష్టం

**- యస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్**



**నారాయణపేట, జులై 6(జనంసాక్షి):** నారాయణపేట మండలం, సింగారం, జాజాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ అమరేందర్ కృష్ణ పర్యటించి యస్.ఐ.ఆర్ (సర్) ప్రక్రియను పరిశీలించి, ఓటు పోతే మళ్ళీ రావడం కష్టమని సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను గడువులోగా పూర్తి చేయాలని కోరారు. సోమవారం సింగారం పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ మాట్లాడుతూ సింగారం గ్రామంలో యస్. ఐ. ఆర్. ప్రక్రియ నిదానంగా కొనసాగుతుందని, ఎన్యూమరేషన్ ఫారాలను ఇచ్చి వారం గడిచిన ఇంతవరకు 20% శాతం కూడా పూర్తి కాలేదని అసహనం వ్యక్తం చేశారు. టార్గెట్ పెట్టుకుని గడువులోగా పూర్తి చేయాలని బిఎల్వోలను ఆదేశించారు. అలాగే విద్యావంతులైన యువకులు తెలియని వారికి సహాయ సహకారాలు అందించాలని, ఎమైన అనుమానలు ఉంటే అధికారుల వద్ద తెలుసుకుని రాయాలన్నారు.గ్రామంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని. ఓటర్లు తమ వివరాలు ఎన్యూమరేషన్ ఫారాలలో నింపి గడువులోగా బిఎల్వోలకు అందజేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో ఇవ్వకపోతే ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని, ఓటు పోతే మళ్లీ రావడం కష్టమని అన్నారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు. అంతకుముందు జిపి కోఆర్డినేషన్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మప్ప, మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్ రెడ్డి, సిద్దప్ప, సుధాకర్ రెడ్డి, చంద్రకాంత్, చిన్నయ్య, నరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జీపిఓ విజయకుమార్, బీఎల్వోలు, ఆశ వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్ల నియామకాలకు రిజర్వేషన్లు ఖరారు

**- ప్రకటించిన జహీరాబాద్ సీడిపీఓ సుశీల**



**న్యాల్‌కల్, జూలై 06,(జనంసాక్షి):** న్యాల్ కల్ మండలంలోని 7 అంగన్వాడి కేంద్రాల్లో తాజాగా టీచర్ల నియామకాల కోసం రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఈ మేరకు జహీరాబాద్ డివిజన్ సీడీపీఓ సుశీల సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని చాల్కి అంగన్వాడి కేంద్రాన్ని బీసీ (ఈ), చీకుర్తి, రేజింతల్, కల్బేమల్ కేంద్రాలను జనరల్‌గా ఖరారు చేశారు. ఇబ్రహీంపూర్ బీసీ (ఏ), ముంగి బీసీ (డీ), న్యామతాబాద్ అంగన్వాడి కేంద్రానికి బీసీ (బీ)గా ఖరారు చేశారు. ముంగి గ్రామ పంచాయతీ పరిధిలోని ముంగితాండ అంగన్వాడి కేంద్రానికి "ఆయా" నియామకం కోసం ఎస్టీలకు ఖరారు చేశారు. కనీసం ఇంటర్ ఉత్తీర్ణత కలిగి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జహీరాబాద్ డివిజన్ పరిధిలోని సీడీపీఓ కార్యాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# బదిలీపై వెళ్తున్న ఏఈఓలకు ఘన వీడ్కోలు

**- ఘనంగా సన్మానించిన ప్రజా ప్రతినిధులు**



**న్యాల్‌కల్, జూలై 06, (జనంసాక్షి) :**
మండల కేంద్రమైన న్యాల్‌కల్, మండలంలోని హద్నూర్ సెక్టార్‌లో పరిధిలోని పలు గ్రామాల్లో సుదీర్ఘ కాలంగా వ్యవసాయ రంగానికి, రైతులకు సేవలందించి బదిలైన ఏఈఓ లకు ఘనంగా వీడ్కోలు పలికి, సత్కరించారు. సోమవారం న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో.. మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సభకు జహీరాబాద్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 9 సంవత్సరాలుగా హద్నూర్ సెక్టర్ పరిధిలో విధులు నిర్వహించిన ఏఈఓ సాయిలు, న్యాల్ కల్ సెక్టార్ పరిధిలో ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన హీనా రాథోడ్ లకు ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన, వీడ్కోలు సభలో.. జహీరాబాద్ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ, న్యాల్ కల్ సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, హద్నూర్ సహకార సంఘం చైర్మన్ జగన్నాథ్ రెడ్డి, పలువురు సర్పంచులు దేశెట్టి పాటిల్, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అధికార, విపక్ష పార్టీ శ్రేణులు ప్రవీణ్ కుమార్, యాదవ రావు పాటిల్, పలువురు ఏఈవోలు, ఏఈఓల సంఘం ప్రతినిధులు, తదితరులు సభలో మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి, రైతులకు అందించిన సేవలను గుర్తు చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో ఎరువులు, విత్తనాల విక్రయాల డీలర్లు వెంకట్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, మాజిద్, అశోక్, సెక్టార్ల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, జూలై 6 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించడానికి చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి వివరాలను తెలుసుకుని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వినతులను అందజేసి తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 66 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 35, సంగారెడ్డి డివిజన్‌లో 13, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 6, జహీరాబాద్ డివిజన్‌లో 12 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన దళారి శ్రీనివాస్



**వట్పల్లి, జూలై 6 (జనం సాక్షి):** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో వట్పల్లి మండలం బుత్కూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు తలారి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూల బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు యువత ను బలోపేతం చేయడానికి కృషి చేయాలని శ్రీనివాస్ కు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఉన్నారు.

## మెదక్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన మక్తా భూపతిపూర్ సర్పంచ్ కొమ్ము పవన్



**మెదక్ జులై 6(జనంసాక్షి):** మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామానికి నూతన పంచాయతీ భవనం కు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ను కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందచేసిన మక్త భూపతిపూర్ గ్రామ సర్పంచ్ కొమ్ము పవన్ కలెక్టర్ సానుకూలంగా స్పందించిందని కొమ్ము పవన్ తెలియజేశారు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కు మక్త భూపతిపూర్ పాలకవర్గం కలెక్టర్ ప్రథమ సింగ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము పవన్ తో పాటు కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ఆదిల్ పాషా, మల్లన్న కాడి తండా సర్పంచు బన్సీలాల్ పరమేష్, మరికొందరు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### కల్లేపల్లి గ్రామ అభివృద్ధి కోసం

# ప్రజావాణిలో వినతిపత్రం అందజేత

**- కలెక్టర్‌ను కలిసిన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు**



**బెజ్జంకి,జూలై 6,(జనంసాక్షి):** మండలంలోని కల్లేపల్లి గ్రామ అభివృద్ధి కోసం నూతన తాగునీటి బావి,ప్రభుత్వ పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్ర భవనం మంజూరు చేయడంతో పాటు గ్రామానికి ఆశా కార్యకర్తను నియమించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక సదుపాయాల కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు కొత్త పాఠశాల భవనం, చిన్నారుల సంక్షేమం కోసం అంగన్‌వాడీ భవనం, తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బావి,గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆశా కార్యకర్తను వెంటనే నియమించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిగుల్ల మోహన్, ఉపసర్పంచ్ శేషి వినీత్,వార్డు సభ్యులు మంకాళి మిథున్ పాల్గొన్నారు.

## గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

**- పీసీ, పీఎన్‌డీటీ చట్ట అమలుపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం**

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 06(జనంసాక్షి):** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితా దేవి హెచ్చరించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను అరికట్టడంతో పాటు పీసీ, పీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైద్య నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.
సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాల పనితీరు, చట్ట అమలు విధానం, రికార్డుల నిర్వహణ, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, లింగ నిర్ధారణ నిషేధానికి సంబంధించిన నిబంధనలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ... గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ప్రతి స్కానింగ్ కేంద్రం పీసీ, పీఎన్‌డీటీ చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా చట్టంపై అవగాహన పెంపొందించుకుని, ఎక్కడైనా లింగ నిర్ధారణకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మహిళా, శిశు సంరక్షణతో పాటు బాలికల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### బివిఆర్ఐటిలో

## ఐఈఈఈ సర్క్యూట్స్ అండ్ సిస్టమ్స్ సొసైటీ సదస్సు



**నర్సాపూర్, జూలై 6 (జనంసాక్షి):** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో ఐఈఈఈ సర్క్యూట్స్ అండ్ సిస్టమ్స్ సొసైటీ విద్యార్థి విభాగంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎక్స్పర్ట్ ఐపి సిస్టమ్స్ అండ్ సొల్యూషన్ సంస్థకు చెందిన నుపూర్ షా పాల్గొని ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్ బిజిఎ కంప్యూటింగ్ కృత్రిమ మేధస్సు (ఏఐ) 5G సాంకేతికత హై-పర్ ఫార్మెన్స్ కంప్యూటింగ్ రంగాల్లో వస్తున్న తాజా పరిణామాలు ఉపాధి అవకాశాలపై సమగ్రంగా వివరించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని వినూత్న ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ ధూబే మాట్లాడుతూ ఐ ఈఈఈ సర్క్యూట్స్ అండ్ సిస్టమ్స్ సొసైటీ ఫ్యాకల్టీ అడ్వైజర్ డా.చిన్నయ్య కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ పరిశ్రమ విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ఇటువంటి సాంకేతిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలపై స్పష్టమైన అవగాహన కల్పించిందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇంజనీరింగ్ విభాగం డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ కళాశాల మేనేజర్ బాపిరాజు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## సాయి మాణిక్ నగర్‌లో రూ.40 లక్షల సీసీ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

**- 40 లక్షల హెచ్ఎండి నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి**

**- జిల్లా కలెక్టర్‌కు ప్రతిక్ జైన్‌కు కౌన్సిలర్లు, సురేష్, శ్రీకాంత్**

**- కాలనీవాసుల వినతి**



**సంగారెడ్డి, జూలై 6 (జనం సాక్షి):** సంగారెడ్డి మున్సిపాలిటీ 8వ వార్డు పరిధిలోని సాయి మాణిక్ నగర్‌లో హెచ్ఎండీఏ గ్రాంట్స్ 2025 -26 కింద మంజూరైన రూ.40 లక్షల సీసీ రోడ్డు పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంపై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్‌కు కౌన్సిలర్లు సురేష్, శ్రీకాంత్, వినతి పత్రం అందజేశారు

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...**

నారాయణ రెడ్డి కాలనీ 8వ వార్డు సిసి రోడ్ల అభివృద్ధి కోసం 40 లక్షల హెచ్ఎండిఏ నిధులు గతంలో మంజూరయ్యాయని ఇప్పటివరకు సిసి రోడ్ల నిర్మాణం లేదు నిధులు లేవు అన్నారు 40, హెచ్ఎండిఏ నిధులపై తక్షణమే విచారణ జరిపి వాడు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.
హెచ్ఎండిఏ నిధులు మున్సిపల్ అభివృద్ధి కోసం 2025, 27-09-2025 ద్వారా హెచ్ఎండీఏ గ్రాంట్స్ 2025--26 కింద రూ.80 కోట్ల అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతి లభించింది. ఇందులో సీరియల్ నం.9 ప్రకారం సాయి మాణిక్ నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో సత్యనారాయణ ఇంటి నుంచి H.No.5-1-36/9/A వరకు, మహేష్ ఇంటి నుంచి రాములు ఇంటి వరకు, మల్లేశం ఇంటి నుంచి సత్యనారాయణ ఇంటి వరకు సీసీ రోడ్ల నిర్మాణానికి అనుమతి మంజూరైంది. ఈ పనుల అమలు బాధ్యతను సంగారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్‌కు అప్పగించినప్పటికీ, అనుమతులు వచ్చి నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదని స్థానికులు ఆరోపించారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ కింద మంజూరైన ఇతర అభివృద్ధి పనులు పూర్తవుతుండగా, తమ కాలనీ మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.



రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో వర్షాకాలంలో బురద, వేసవిలో దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, వాహనదారులు నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌ను తక్షణమే జోక్యం చేసుకుని సంబంధిత హెచ్ఎండీఏ అధికారులు, మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్‌ను వెంటనే పనులు ప్రారంభించేలా ఆదేశించాలని కోరారు. అలాగే పనుల జాప్యానికి గల కారణాలపై విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేష్ గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సాధనకు క్రమశిక్షణే విజయ మంత్రం : సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**- 68 రోజుల ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం**

**- ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగి లక్ష్యంగా సేవా కార్యక్రమాలు**







**కల్వకుర్తి,జులై 6,(జనంసాక్షి):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో గత 68 రోజులుగా నిర్విరామంగా నిర్వహించిన ఉచిత పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులను అభినందించిన ఆయన,రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. శిక్షణతో పాటు క్రమశిక్షణ,పట్టుదల, ఆత్మవిశ్వాసం విజయానికి పునాదులని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని అన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధమైన చదువు,శారీరక దృఢత్వం, సమయపాలన, నిరంతర సాధన అవసరమని సూచించారు. అపజయాలను చూసి నిరుత్సాహపడకుండా ప్రతి ప్రయత్నాన్ని విజయానికి మార్గంగా మలుచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. గత 68 రోజులుగా శిక్షణను సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలు ఉద్యోగ సాధనలో కీలకంగా నిలుస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో "స్కిల్ ఫ్యాక్టరీ" ద్వారా కృత్రిమ మేధస్సు, సమాచార సాంకేతికత, భాషా నైపుణ్యాలు, ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు."ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగి" లక్ష్యంతో సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు శంకర్, ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు శేఖర్‌తో పాటు శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

## కుర్తివాడ ఇసుక రూ 2.76 లక్షలు



**పాపన్నపేట, జులై 6 (జనంసాక్షి):** ఇసుకకు పాపన్నపేట రెవెన్యూ అధికారులు వేలంపాట నిర్వహించారు. కుర్తివాడ గ్రామ శివారులో మంజీరా నది నుండి తీసి అక్రమంగా నిల్వ చేసిన మొత్తం 300 క్యూబిక్ మీటర్ల ఇసుకకు సోమవారం కుర్తివాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కొత్తూరి శ్రీనివాస్ వేలం పాటలో పాల్గొని రూ.920 కీ క్యూబిక్ మీటర్ చొప్పున మొత్తం 300 క్యూబిక్ మీటర్ల ఇసుకను రూ 2.76 లక్షలకు హక్కు దక్కించుకున్నారు. తహశీల్దార్ సతీష్ కుమార్,ఆర్ఐ శరత్,సిబ్బంది రాజు ఉన్నారు.

## రహదారిని కమ్మేస్తున్న చెట్లపొదలు



**రాజాపూర్, జులై 6(జనంసాక్షి):** రంగారెడ్డిగూడ నుండి తిరుమలాపూర్ వెళ్ళే రహదారికి ఇరువైపులా రంగారెడ్డిగూడ దగ్గర చెట్లు కొమ్మలు, పొదలు పొరలుగా రహదారికి అడ్డంగా రావడంతో, వాహనదారులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నామని అంటున్నారు. నిత్యం సింగమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఏడు తాండాల ప్రజలు, ఖానాపూర్,తిరుమలాపూర్ ప్రజలు వాహనాలపై రాకాపోకలు సాగిస్తుంటారు. రంగారెడ్డిగూడ గ్రామస్తులు వ్యవసాయ పోలాలకు ఈ రహదారి పైనే వెళుతుంటారు. ఈ చెట్లపొదలను తొలగించి రహదారిని రకాపోకలకు అనుకూలంగా చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## జంతువుల నుండి మనుషులకు వ్యాపించే అంటూ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

**- పశువైద్యాధికారి శివరాజ్**




**మిడ్జిల్. జులై 6(జనంసాక్షి):** ఆప్యాయంగా సాధుకునే జంతువుల నుండి మనుషులకు వ్యాపించే జోనోసిన్ వ్యాధుల పై సోమవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో విద్యార్థినీ విద్యార్థులకు పశు వైద్య అధికారి డాక్టర్ శివరాజ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు వ్యాధి నుండీ వచ్చే అనర్థాల అంశాలపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు జంతువుల నుండి మనుషులకు సక్రమించే వ్యాధిని జోనోసిన్ వ్యాధులు అంటారు ఈ వ్యాధి కుటుంబ సమాజ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు ఈ వ్యాధి జంతువులతో సన్నిహితంగా ఉండడం శుభ్రత పాటించకపోవడంతో వ్యాధి సోకుతుందని అన్నారు సబ్బుతో చేతులు తరచుగా కడుకోవడం మాంసం గుడ్లు పూర్తిగా ఉడికించి తినడం తో పాటు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం వలన వ్యాధులు నివారించడం జరుగుతుందని సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ గణేష్ వెటర్నరీ వైద్య సిబ్బంది సత్యం శ్రీనివాస్ వేణుగోపాలచారి. రామకృష్ణ. విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

## జిల్లాలో 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

**- పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తాం**

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 6 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు. రేపటిలోగా వంద శాతం ఫారాల పంపిణీ పూర్తి చేస్తామని, అనంతరం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా చేపడతామని చెప్పారు. జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డప్పూర్‌లో చురుగ్గా సర్ ప్రక్షాళన కార్యక్రమం

**- ఉత్సాహంగా హాజరైన ఓటర్లు**




**న్యాల్‌కల్, జులై 06, (జనంసాక్షి):** మండలంలోని డప్పూర్ గ్రామంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్షాళన కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుంది. కార్యక్రమాన్ని మరింతగా వేగవంతం చేసేందుకు గ్రామ సర్పంచ్ జగదాంబ, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిరణ్ కుమార్ గౌడ్‌లు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, బిఎల్ఓ జై సింగ్ రాథోడ్, బిఎల్ఏల పర్యవేక్షణలో ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో దాదాపు 2200 ఓటర్లకు గాను సోమవారం తొలి రోజు 380కి పైగా ప్రక్షాళన చేపట్టారు. ప్రత్యేక శిబిరాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో అనునిత్యం కొనసాగనించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి : బీఎల్ఓలకు ఆర్డీఓ సుబ్రమణ్యం ఆదేశం



**శ్రీరంగాపూర్, జులై 6 (జనంసాక్షి):**
ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (SIR)లో భాగంగా పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్ల నుండి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ, ఓటరు నమోదు అధికారి సుబ్రమణ్యం బూత్ లెవల్ ఆఫీసర్లను ఆదేశించారు. సోమవారం ఆయన పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో పర్యటించి (SIR) ప్రక్రియను పరిశీలించారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి పూరించిన ఫారాలను సేకరించాలని, ఫారం నింపడం తెలియని ఓటర్లకు దగ్గరుండి సహాయం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా వనపర్తి శాసన సభ నియోజకవర్గంలోని పెబ్బేరు మండలం రంగాపూర్, కంచిరావుపల్లి, శ్రీరంగాపూర్ మండలం కంబాలాపూర్ గ్రామాలకు చెందిన పోలింగ్ స్టేషన్ నెం. 222, 223, 225, 252,j 253, 202 లను ఆర్డీఓ ఆకస్మికంగా సందర్శించారు. బీఎల్‌ఓలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న తీరును, సూపర్‌వైజర్ల పనితీరును ఆయన పరిశీలించారు. జిల్లాలో (SIR) ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం మరియు తాసిల్దార్ వరలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జులై 6 (జనంసాక్షి):**ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 31 ఫిర్యాదులు వచ్చాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహేష్ గౌడ్ ను పరామర్శించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**ఉర్కొండ జూలై 06, (జనంసాక్షి);**
హైదరాబాదులోని మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగర్కర్నూల్ జిల్లా ఊరుకొండ మండల దిశా విలేఖరి మహేష్ గౌడును మాజీ మంత్రి డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి పరామర్శించారు. రిపోర్టర్ అల్వాల మహేష్ గౌడ్ ఇటీవల తన వ్యవసాయ పొలం వద్ద పాము కాటుకు గురై తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని మలక్పేట యశోద ఆసుపత్రిలోచేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఆస్పత్రికి వెళ్లి మహేష్ గౌడ్ ను పరామర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న మహేష్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అందిస్తున్న వైద్య సేవల గురించి అక్కడి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మహేష్ కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. మహేష్ గౌడ్ త్వరగా కోలుకుని, పూర్ణ ఆరోగ్యంతో క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. మాజీ మంత్రి వెంట బొమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు వెంకటేష్, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఊర్కొండ మండల అధ్యక్షుడు ఎండీ అక్బర్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, జర్నలిస్ట్ వివేక్ తదితరులు ఉన్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం... పరిస్థితి విషమం?




**మల్దకల్, జూలై 6(జనంసాక్షి):** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారంమల్దకల్‌మండలం ఉలిగేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారంఉలిగేపల్లి గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మంటలార్పే క్రమంలోమరో ఒకరుకి గాయాలు కాగాగాయపడిన వారిని గద్వాల జిల్లా ఆసుపత్రిలో తరలించి చికిత్స అందిస్తున్నారు.

## అదనపు కట్నం వేధింపుల ఆరోపణలు.. భర్త, అత్తమామలపై కేసు

**గోపాలపేట, జూలై 6 (జనంసాక్షి):** అదనపు కట్నం కోసం వివాహితను శారీరకంగా, మానసికంగా వేధించి ఇంటి నుంచి వెళ్లగొట్టినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై గోపాలపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏదుల మండలం చెన్నారం గ్రామానికి చెందిన పల్లవికి నాలుగేళ్ల క్రితం శివకుమార్‌తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో రెండు తులాల బంగారం, రూ.2 లక్షల నగదును కట్నంగా ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాహానంతరం రెండేళ్ల పాటు దాంపత్య జీవితం సజావుగా సాగిందని, అనంతరం భర్త శివకుమార్, అత్త లక్ష్మి, మామ చిన్నయ్య అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి తెచ్చారని బాధితురాలు ఆరోపించింది. తన తల్లి నిర్మించిన ఇంటిని భర్త పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ వేధింపులకు పాల్పడినట్లు తెలిపింది. ఈ విషయమై పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ నెల 1న తనపై దాడి చేసి, ఇల్లు భర్త పేరిట రిజిస్ట్రేషన్ చేసే వరకు ఇంట్లోకి రావద్దంటూ బలవంతంగా బయటకు పంపించారని ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త శివకుమార్‌తో పాటు అత్త లక్ష్మి, మామ చిన్నయ్యలపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

# చేర్యాల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**- 70 వేల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**



**చేర్యాల, జూలై 06 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా చేర్యాల మండల తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో తహశీల్దార్ దిలీప్ నాయక్ 70 వేల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుపడ్డారు. విలేకరుల సమావేశంలో అవినీతి నిరోధక శాఖ సంగారెడ్డి డిఎస్పి సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28న ఏసీబీకి వచ్చిన ఫిర్యాదు మేరకు చేర్యాల మండలంలోని నాగపురి గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 833/బీ, 833/సీ, 833/డీ, 833/ఈ, 834/బీ, 834/సీ, 834/డీ, 834/ఈ పరిధిలోని మొత్తం 30 గుంటల భూమికి సంబంధించిన 11 నాలా కన్వర్షన్ దరఖాస్తులను ప్రాసెస్ చేసి అధికారిక అనుమతులు మంజూరు చేయడానికి తహసీల్దార్ లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ దరఖాస్తుల్లో ఇప్పటికే 8 దరఖాస్తులు ప్రాసెస్ చేయగా, మిగిలిన ప్రక్రియ పూర్తి చేయడానికి లక్ష యాభైవేలు ఎమ్మార్వో డిమాండ్ చేయగా చివరకు రూ.70 వేల లంచం కోరడంతో బాధితులు జరిగిన విషయాన్ని ఏసీబీ అధికారులకు తెలపడంతో సోమవారం రోజు పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని, తహసీల్దార్ కార్యాలయంలోనే రూ.70 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం ఆయన వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా తన విధులను నిజాయితీగా నిర్వర్తించాల్సిన తహసీల్దార్, అధికారిక పనిని చేయడానికి అక్రమంగా లంచం డిమాండ్ చేసి స్వీకరించడం ద్వారా అవినీతికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తహసీల్దార్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అవినీతి నిరోధక శాఖ సంగారెడ్డి డిఎస్పి సుదర్శన్ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వాట్సాప్ 9440446106 ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈ సోదాలలో అవినీతి నిరోధక శాఖ సంగారెడ్డి డిఎస్పి సుదర్శన్ తోపాటు ఇద్దరు ఎస్ఐలు, పదిమంది అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

# డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు చిరస్మరణీయం : బీజేపీ

**- 125వ జయంతి సందర్భంగా నాగవరంలో ఘన నివాళులు.. పార్టీ కార్యాలయంలో కార్యక్రమం**



**వనపర్తి బ్యూరో, జూలై 6 (జనంసాక్షి):**
భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్త డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా నాగవరంలోని బీజేపీ జిల్లా నూతన పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ మాట్లాడుతూ, దేశ ఐక్యత, సమగ్రత కోసం డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మర ణీయమని అన్నారు. 33 ఏళ్ల వయసులోనే కలకత్తా విశ్వవిద్యాల యానికి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన, అనంతరం తొలి కేంద్ర మంత్రివర్గంలో పరిశ్రమలు, సరఫరాల శాఖ మంత్రిగా సేవలందించారని గుర్తు చేశారు.

1950లో నెహ్రూ-లియాఖత్ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేసిన డా. ముఖర్జీ, 1951 అక్టోబర్ 21న భారతీయ జనసంఘ్‌ను స్థాపించి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తికి నాంది పలికారని తెలిపారు. జమ్మూ-కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370, 35ఏ నిబంధనలను వ్యతిరేకిస్తూ ఉద్యమించారని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే 2019లో కేంద్ర ప్రభుత్వం ఆ నిబంధనలను రద్దు చేసిందని పేర్కొన్నారు.

డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డి.నారాయణ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, కార్యదర్శి కాటమోని కృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు బచ్చు రాము, బోయల రాము, అశ్విని రాధ, కౌన్సిలర్ విజయసాగర్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నలబోతుల అరవింద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, మాజీ కౌన్సిలర్లు గోపాల్ యాదవ్, కంచరవి, నాయకులు రాయన్న, సాగర్, వెంకటేష్ నాయక్, చిన్న రాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూలు స్వీపర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి : మోష



**వనపర్తి రూరల్, జూలై 06, (జనంసాక్షి):**
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 5,000 మంది స్వీపర్లకు నెలకు రూ.26,000 కనీస వేతనం అమలు చేసి, నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని స్కూలు స్వీపర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు మోష డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా జడ్పీసీఈఓ కార్యాలయం ఎదుట స్వీపర్లు నిరసన చేపట్టి, జడ్పీ సీఈఓ యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోష మాట్లాడుతూ...., గత 30 ఏళ్లుగా స్వీపర్లు అత్యల్ప వేతనంతో సేవలందిస్తున్నప్పటికీ ప్రస్తుతం నెలకు కేవలం రూ.5,200 మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. ఈ వేతనంతో కుటుంబ పోషణ అసాధ్యమని, సుప్రీంకోర్టు కనీస వేతనం అమలు చేయాలని సూచించినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. స్వీపర్ల విధులు, ఇటీవల నియమించిన స్కావెంజర్ల విధులు వేర్వేరని, కొన్ని పాఠశాలల్లో ఇద్దరి పనులను ఒకే వ్యక్తితో చేయించాలని ఒత్తిడి తేవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇటువంటి వేధింపులు కొనసాగితే సంబంధిత పాఠశాలల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమస్యను జడ్పీ సీఈఓ దృష్టికి తీసుకెళ్లగా, చిన్న ఉద్యోగులను వేధించకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వీపర్ల సంఘం అధ్యక్షుడు గోపాల్ గౌడ్, కోశాధికారి అబ్దుల్ ఖయ్యూం, నాయకులు అభిమన్యు, మాలిక్, కురుమన్న, శాంతన్న, శ్రీనివాసులు, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మరో రూ.2 కోట్లు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో నిధుల మంజూరు
- జీఓ ఆర్‌టీ నెం.147 విడుదల
- బ్రహ్మోత్సవాల నాటికి సమగ్ర అభివృద్ధే లక్ష్యం





**వనపర్తి,బ్యూరో, జూలై 6 (జనంసాక్షి):** వనపర్తి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు జీఓ ఆర్‌టీ నెం.147ను ప్రభుత్వం విడుదల చేసింది. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇప్పటికే రూ.1 కోటి నిధులు మంజూరు చేయించగా, తాజాగా మరో రూ.2 కోట్లను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఈ నిధులను పూజారుల వసతి గదుల నిర్మాణం, మండపాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నెలలో ఆలయం నిర్మాణం పూర్తై 50 సంవత్సరాలు పూర్తయ్యే సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాల నాటికి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# వనపర్తిలో ఘనంగా సహకార వారోత్సవాల ముగింపు



**వనపర్తి, బ్యూరో జూలై 6 (జనంసాక్షి):** భారత ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం వనపర్తిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సహకార మంత్రిత్వ శాఖ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని సహకార సంఘాల కార్యదర్శులు, సహకార శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానించారు. అలాగే క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కో-ఆపరేటివ్ క్లబ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమతి బి. రాణి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, రైతుల ఆర్థిక సాధికారతలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఏసిఎస్) ముఖ్యమైన వేదికగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. "సహకార్ సే సమృద్ధి" లక్ష్యంతో సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జూన్ 29 నుంచి జూలై 6 వరకు వనపర్తి జిల్లాలో నిర్వహించిన సహకార వారోత్సవాల్లో భాగంగా మొక్కల నాటకం, అవగాహన సదస్సులు, రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు, విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచార కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి బి. రాణి, జిల్లా సహకార శాఖ అధికారులు, పీఏసీఎస్ కార్యదర్శులు, సహకార సంఘాల ప్రతినిధులు, రైతులు, ఉద్యోగులు, వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కో-ఆపరేటివ్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్నారంలో అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభం



**తెలకపల్లి, జూలై 6, (జనంసాక్షి):** మండల పరిధిలోని లక్నారం గ్రామంలో రూ.4.50 లక్షల వ్యయంతో అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ దుల్ల సువర్ణ బాలమశాల్, ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నా మని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ బాధ్యత అని, గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

గ్రామంలో పరిశుభ్రత, ప్రజారోగ్యం మరియు మెరుగైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా అండర్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగుపడతాయని అన్నారు.

ప్రజల సహకారంతో లక్నారం గ్రామాన్ని పరిశుభ్రమైన, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి పవన్ కుమార్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతి నిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రధాన రహదారి నిర్మాణానికి ప్రజావాణిలో వినతి



**అల్లాదుర్గం, జూలై 6 (జనంసాక్షి):** మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామ ప్రధాన రహదారి ధ్వంసం అయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, రహదారిని వెంటనే నిర్మించాలని కోరుతూ అల్లాదుర్గ్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం గ్రామస్తులు ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వర్షాకాలంలో రహదారిపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే నిధులు మంజూరు చేసి దీర్ఘకాలికంగా పరిష్కారం చూపాలని,రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులతో వెంటనే మనమత్తు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో కూడా ఇదే విషయాన్ని పలుమార్లు ఎంపీడీవో , కలెక్టర్ కు కూడా వినతి పత్రాలు అందించామన్నారు. ఈ సమస్య దీర్ఘకాలంగా ఉంటే ప్రజలు ఎన్ని రోజులు ఇబ్బంది పడాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ ద్వారా తాత్కాలిక మరమ్మత్తులు వెంటనే చేయించాలని కోరారు.ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషిచేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సయ్యద్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

## వెల్దండ ఇన్చార్జ్ ఎంపిఓగా గిరి గౌడ్



**వెల్దండ, జూలై 06 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల ఇన్చార్జ్ ఎంపీవోగా గిరి గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధికి సమిష్టి కృషి చేస్తానని చెప్పారు. ఇక్కడ ఎంపిఓగా పనిచేస్తున్న లక్ష్మణ్ రాథోడ్ కు ఇటీవల ఎంపీడీవోగా పదోన్నతి వచ్చి మహబూబ్ నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెల్దండ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న గిరి గౌడ్ అదనంగా ఎంపీఓగా ఇంచార్జ్ బాధ్యతను స్వీకరించారు.

## సామాజిక న్యాయానికి బాటలు వేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టోజు బ్రహ్మాచారి



**వనపర్తి బ్యూరో, జూలై 6 (జనంసాక్షి):** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి సాధికారతకు ఆయన చేసిన సేవలు ఎనలేనివి అని, సామాజిక న్యాయానికి బాటలు వేసిన మహానేత దివంగత నేత దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టోజు బ్రహ్మాచారి కొనియాడారు. సోమవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బాబు జగ్జీవన్ రావ్ 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమాన హక్కుల సాధనకు విశేష కృషి చేశారని కొనియాడారు. దేశ రాజకీయాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సామాజిక సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు బి కృష్ణ, కోళ్ల వెంకటేష్, ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు ఈరపోగు రాజ్ కుమార్, కౌన్సిలర్లు విజయలక్ష్మి, విభూది మహేశ్వరి, క్రాంతి కుమార్ గౌడ్, పీతంబర్, శ్రీనివాసులు, పాండు సాగర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు గోర్ల జానకి రాములు పలువురు పాల్గొన్నారు.

## యాంటీ రాబిస్ టీకాలను వేసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



**గద్వాల నడిగడ్డ,జూలై 6(జనంసాక్షి);** పెంపుడు కుక్కలకు రాబిస్ టీకాలను తప్పక వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్.జి వెంకటనారాయణ అన్నారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ పశు వైద్యశాలలో ప్రపంచ జోనోసిస్ దే ను పురస్కరించుకొని పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు వేసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి .వెంకటనారాయణ అనంతరం ఆయన మాట్లాడుతూ జంతువుల నుండి మనుషులకు వ్యాపించే ప్రమాదకరమైన రేబిస్ వ్యాధి అని ,ఈ యొక్క రేబిస్ వ్యాధి పట్ల ప్రజలు, ముఖ్యంగా పెంపుడు జంతువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని, కుక్కల ద్వారా రేబీస్ వ్యాధి వ్యాపిస్తుందనీ, కనుక టీకాలు వేయడం ద్వారా మీ పెంపుడు కుక్కలను రేబిస్ వ్యాధి నుండి రక్షించవచ్చు, మీ కుటుంబాన్ని ఈ యొక్క సమాజాన్ని సురక్షితంగా ఉంచవచ్చు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ అర్పిత, నవీన్ చంద్ర, పురం వినయ్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్లు భార్గవి, సి.కనకరాజు, ఎల్ఎస్ఏలు ప్రభాకర్, యుగంధర్, అటెండర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## బిసి,ఇబిసి విద్యార్థులు స్కాలర్షిప్ కొరకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అక్బర్ పాషా



**గద్వాల నడిగడ్డ,జూలై 6 (జనంసాక్షి);** 2026-27 విద్యా సంవత్సరానికి గాను బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన 9వ, 10వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ప్రీ-మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అక్బర్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికేట్, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో సమర్పించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం హార్డ్ కాపీలను కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం లేదా సమీప బీసీ వసతిగృహ సంరక్షకునికి అందజేయాలనీ, అర్హత, మెరిట్ ఆధారంగా ఎంపికైన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.4,000/- చొప్పున స్కాలర్‌షిప్ మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజావాణి ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ మధుమోహన్**
**- ప్రజావాణికి 89 ఫిర్యాదులు**



**గద్వాల నడిగడ్డ, జులై 6(జనంసాక్షి);** ప్రజావాణి ఆర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధు మోహన్ అన్నారు.

సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ వారం మొత్తం 89 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి ఎంతో ప్రాధాన్యత ఉందని, హైదరాబాద్ నుంచి కూడా రాష్ట్ర ఉన్నతాధికారులు వీటిపై సమీక్ష చేస్తారన్నారు. గద్వాల మున్సిపాలిటీకి సంబంధించి వచ్చిన ఆర్జీలు అత్యధికంగా పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపిన కొంతమంది అధికారులకు ఇదివరకే మెమోలు ఇవ్వడం జరిగిందన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజావాణికి గైర్హాజరయితే ముందుగానే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎవరైనా జిల్లా అధికారులు రాలేని పరిస్థితి ఉన్నప్పుడు వారి స్థానంలో పాల్గొనేందుకు సంబంధిత శాఖల తర్వాతి స్థాయి అధికారులను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**



**ఇటిక్యాల, జులై 6 (జనంసాక్షి):** వ్యవసాయ పనులకు తోడుగా ఉండటంతో పాటు ఇంటికి చేదోడు వాదోడుగా ఉండాల్సిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మండలంలోని షాబాద్ గ్రామానికి చెందిన రాజు జయమ్మల ఏకైక కుమారుడు ఆర్ఫన్ (19) రోజు మాదిరిగానే సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్ళాడు. గత మూడు రోజులుగా ఈదురు గాలులకు వ్యవసాయ పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలను గమనించని అర్ఫన్ పొలం పనులు చేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో అతడు అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అర్ఫాన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంట్లో చేదోడు వాదోడుగా ఉండాల్సిన కుమారుడు కళ్ళముందే విగతజీగా పడి ఉండడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. వారి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అలంపూర్ దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ బాలకృష్ణారెడ్డిలు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలోని అర్ఫాన్ మృతదేహం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**- ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన డీవై సీఈవో,పీడీ హౌసింగ్ గోపాల్ నాయక్**



**తెలకపల్లి, జూలై 6, (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని డీవై సీఈవో,పీడీ హౌసింగ్ గోపాల్ నాయక్ సోమవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటశాల, భోజన వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని హాస్టల్ వార్డెన్ గీతకు ఆదేశించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, వారి ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ తనిఖీలో ఎంపీడీఓ శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ గీత పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి



**గద్వాల నడిగడ్డ, జులై 6(జనంసాక్షి);** కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను జిల్లాలో సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎన్యుమరేషన్ పత్రాలను ప్రతి ఇంటికి అందజేయడమే కాక పూరించిన పత్రాల వివరాలను నిర్దేశిత యాప్ లో ఎప్పటికప్పుడు బిఎల్వోలు నమోదు చేసేలా మండలాల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పత్రాలను పూరించడంలో ఇబ్బందులు పడుతున్న ఓటర్లకు బిఎల్ఎలు, వాలంటీర్లు సహకరించేలా చూడాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై ప్రతి బుధవారం సమావేశం నిర్వహించాలన్నారు.




గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపుగా ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ పత్రాలను ఇవ్వడం జరిగిందని, వాలంటీర్ల సహకారంతో ఓటర్లు ఆ పత్రాలను ఫిలప్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ నిబంధనల ప్రకారం చేయడం జరుగుతుందని తెలిపారు. వీసీ అనంతరం వివిధ మండలాల తహసిల్దార్లతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. బిఎల్ఓలకు ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు వాటిని పరిష్కరించాలన్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్లో నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించేందుకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సవరణను జిల్లాలో పచ్చడ బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులందరూ చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టలు




**మల్దకల్, జులై 6(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నేతివాని పల్లె గ్రామంలో శ్రీ ఆంజనేయ, వినాయక, శివ పార్వతిదేవి, నందీశ్వర, నవగ్రహ, నాగ దేవతా, వాల్మీకి, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవములు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 7వ తేదీన మంగళ వారము నుండి గురువారము 9 వరకు త్రిదివసదీక్షతో తంత్రసారా ఋక్వేద మంత్రనుసారము బ్రహ్మశ్రీ సహస్రాధిక ప్రతిష్ఠాపన చార్యులు (1052)అఖిల భారత శ్రీ గురు పురస్కార గ్రహీతలు వేదమూర్తులైన జె.రమేశాచార్యులు, బ్రహ్మశ్రీ మణురు ప్రసన్నచార్య, గద్వాల ఋత్విక్ లచే నేతి వానిపల్లె గ్రామములో గల నూతన దేవాలయం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ శివపార్వతి, శ్రీవినాయక, నందీశ్వర,నవగ్రహ, నాగదేవతా,వాల్మీకి విగ్రహాము,బొడ్డురాయి గ్రామలక్ష్మి ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 7 తేదీన మంగళవారము ఉ7-00 గంటలకు గంగపూజ, విగ్రహ ఉరేగింపు, యాగశాల ప్రవేశము, ఆలయ ప్రవేశం,అఖండ దీపస్థాపన, గణపతి పూజ, స్వస్తివాచనము, నాందీ సమారాధనము రక్షా బంధనము, పంచగవ్య పాశనము, నవగ్రహ మృత్యుంజయ పూజ ప్రధాన కలశపూజ, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, ప్రదోషపూజ, ఆవాహిత సర్వ దేవతా హనము, మహా స్నపనము,జలాధివాసం, మంగళహారతి, ఈనెల 8 తేదీన బుధవారము నూతన మంత్ర విగ్రహములకు రుద్రాభిషేకం, ధాన్యాదివాసం,పవమాన హోమం,శ్రీ పురుషామన్య, నవగ్రహ,దీక్ష హోమము మంగళహారతి, తీర్థప్రసాద వితరణ,రుద్ర హోమం,విగ్రహ సంస్కారములు న్యాస విధానం, రాజోపచారములు, శయ్యాధివాసం, మహా మంగళహారతి,తీర్థప్రసాద వితరణ. ఈనెల9 తేదీన గురువారంనూతన యంత్ర విగ్రహములకు అభిషేకం, పీఠసంస్కారము,యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, జయాది హోమం, అనంతరం 9-00 గంటలకు ధ్వజ, గరుడా ధ్వజ స్తంభములు ప్రతిష్టలు, జ్వాలాదర్శనం, గోదర్శనం, బలిహరణ, పూర్ణాహుతి,ఆశీర్వచనం కార్యక్రమములు జరుగుతాయి.

1గంటకు అన్నప్రసాదము కావున భక్తాదులు ఈ కార్యక్రమ సందర్భముగా జరిగే పూజా కార్యక్రమాలలో పాల్గొని ప్రతిష్ట కార్యక్రమములను తిలకించి అమ్మవారి ఆశీర్వాదాన్ని పొందగలరని సర్పంచు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తెలిపారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకే ప్రైవేటు పాఠశాలల నిర్వహణ : ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి





**తెలకపల్లి, జూలై 5,(జనంసాక్షి):** మండలంలోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి (ఎంఈఓ) సి.శ్రీనివాస్ రెడ్డి సోమవారం హెచ్చరించారు. ఈ సందర్భంగా శాంతినికేతన్ విద్యాలయం, కేకే రెడ్డి పాఠశాలలను సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల సంఖ్య, అడ్మిషన్ రిజిస్టర్‌తో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అదనపు సెక్షన్లు లేదా తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. విద్యార్థుల ఫీజులను ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే నిర్ణయించాలని, టీసీ, బోనాఫైడ్ సర్టిఫికెట్లు ఇవ్వడంలో విద్యార్థులు లేదా తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయరాదని సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఎలాంటి వస్తు సామగ్రిని విక్రయించరాదని, పాఠశాల బస్సుల్లో ప్రయాణించే సమయంలోనూ, పాఠశాల ప్రాంగణంలోనూ విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని యాజమాన్యాలకు ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలలు అన్ని అంశాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ



**వెల్దండ, జూలై 06 (జనంసాక్షి):** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో మహిళ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ నుంచి మంజూరైన రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడి కేంద్రం-2 భవన నిర్మాణ పనులకు సర్పంచ్ కేశమల్ల అనూష సోమవారం భూమి పూజచేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పెద్దాపూర్ గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేసమల్ల కృష్ణ, టి ఆర్ ఏ ఈ సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, పలువురు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌లకు ఎన్నికలే నిర్వహించాలి

**- ప్రభుత్వానికి చైర్మన్ల విజ్ఞప్తి**



**జడ్చర్ల, జూలై 6(జనంసాక్షి):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాలను నామినేటెడ్ పద్ధతిలో కాకుండా, ఎన్నికల ద్వారానే భర్తీ చేయాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం డిమాండ్ చేసింది. జడ్చర్లలో జరిగిన సమావేశంలో ఫోరం అధ్యక్షుడు పోతుల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. సొసైటీల వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం చట్టవిరుద్ధమని, వైద్యనాథన్ కమిషన్ సిఫారసుల మేరకు స్వతంత్రంగా పనిచేసేలా చూడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 908 సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి సహకార వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పాలెం సుదర్శన్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్ రెడ్డి, వివిధ జిల్లాల ఫోరం ప్రతినిధులు నరేందర్ రెడ్డి, రాజేందర్ గౌడ్, రఘువర్ధన్ రెడ్డి, రాజగోపాల్, శ్రీధర్ రెడ్డి, శివకుమార్, సలహాదారులు కోదండ రామిరెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, కోశాధికారి అశోక్ రెడ్డి, పలువురు పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

## జిల్లా నూతన ఖోఖో అసోసియేషన్ ఎంపిక



**వెల్దండ, జూలై 06 (జనంసాక్షి):**
ఖోఖో అసోసియేషన్ నాగర్ కర్నూలు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఖోఖో ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశానికి విలియం, శ్రీధర్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, సాయి కుమార్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ కోశాధికారిగా పూరణ్ చంద్, మండల పరిధిలోని రాచూరు గ్రామానికి చెందిన గోకమల్ల రాజు జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కొల్లూరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, ఈసీ సభ్యులుగా కర్నె ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోహన్ లాల్, మహేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఖోఖో క్రీడలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, స్థానిక క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అవకాశాలు కల్పించేందుకు నూతన కమిటీ ప్రాధాన్యత కల్పిస్తుందని పేర్కొన్నారు.

## మైనర్ పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవు

**- ముస్కాన్ 12 సబ్ డివిజన్ ఇంచార్జ్ ఎస్ ఐ ఇందిర**




**అచ్చంపేట, జూలై 6 (జనంసాక్షి):** మైనర్ బాల బాలికలను పనిలో పెట్టుకుంటే సదరు యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ముస్కాన్ 12 అచ్చంపేట సబ్ డివిజన్ ఇంచార్జ్ ఎస్ఐ ఇందిర హెచ్చరించారు. సోమవారం అచ్చంపేట మండల పరిధిలోని హాజీపూర్ పరిసర ప్రాంతాలలో ఇటుక తయారీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు మైనర్ బాలురు పనిలో నిమగ్నమై ఉండగా వారిని గుర్తించి సిడబ్ల్యుసి కమిటీ ముందు హాజరు పరచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఇందిర మాట్లాడుతూ మైనర్ బాల బాలికలను పనిలో పెట్టు కోవడం చట్ట ప్రకారం నేరమని అన్నారు. పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ముస్కాన్ టీం సభ్యులు మహేష్, రాము, సరిత, శివలీల, సిడబ్ల్యుసి సభ్యులు మల్లేష్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో బాల కార్మికుడు గుర్తింపు.. బేకరీ యజమానిపై కేసు

**గోపాల్‌పేట, జూలై 6 (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-XII తనిఖీల్లో గోపాల్‌పేటలోని ఓ బేకరీలో బాల కార్మికుడు పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు బేకరీ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చుక్కా రవి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బేకరీలో 13 ఏళ్ల భూపాని గణేష్ పనులు చేస్తూ కనిపించాడు. విచారణలో గత నెల రోజులుగా నెలకు రూ.5వేల వేతనానికి పనిచేస్తున్నట్లు బాలుడు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో బాల కార్మిక చట్టాన్ని ఉల్లంఘించినట్లు గుర్తించిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చుక్కా రవి ఫిర్యాదు మేరకు బేకరీ యజమాని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.ద

## జడ్చర్లలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**జడ్చర్ల, జూలై 6 (జనంసాక్షి):** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఈ మేరకు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, కరాటే శ్రీను, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షుడు మీనాజ్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. బీసీ జాగృతి సేన రాష్ట్ర ప్రతినిధులు విగ్రహానికి పూలమాలలు వేసి బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు యాదయ్య, డీసీసీ కార్యదర్శి ఎర్ర ఆనంద్, అనుప కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహన్, మాజీ సర్పంచులు జీడీ నిత్యానందం, బుక్కా వెంకటేశం, సర్పంచులు శ్రీనివాస్ యాదవ్, రాములు నాయక్, మార్కెట్ డైరెక్టర్లు లక్ష్మణ్, ఖాజా అలిమోద్దీన్, రాజు నాయక్, మాజీ ఎంపీటీసీలు లక్ష్మమ్మ, అరవిందమ్మ, టౌన్ వైస్ ప్రెసిడెంట్ చాగంటి రఘు, బత్తుల బాలు, తుంగ రఘు, జగదీశ్వర చారి, వెంకటేష్, అజ్జు, రవీందర్, శీను, పెంట్యా నాయక్, మహమ్మద్, మండల రాఘవేందర్, నక్క రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు...

## బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



**తెలకపల్లి, జూలై 06, (జనంసాక్షి):** బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని బాబు జగ్జీవన్ రామ్ సంఘ కమిటీ అధ్యక్షులు రెడ్డపాకుల మహేష్ అన్నారు. ఈ సందర్భంగా స్వేరో నెట్వర్క్ జిల్లా కోశాధికారి భారీగారి పరమేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము ఆనంద్, ఆలేరు సర్పంచ్ ఆనంద్, వార్డు సభ్యుడు భారీగారి లక్ష్మణ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్నగర్ జిల్లా జైలు నుండిపరారైన కిషోర్ కుమార్ రెడ్డి సొంత గ్రామానికి చేరిక

**అమరచింత, జూలై 6 (జనంసాక్షి):** మండలం పరిధిలోని నందిమల్ల గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం ఫోక్ షో కేసులు జైలుకు వెళ్లడం జరిగింది. ఈరోజు ఉదయం తెల్లవారుజామున జైలు నుండి పరారైనట్లు, వార్తలు వచ్చాయి, జైలు అధికారులు ఆత్మకూరు ,అమరచింత పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టారు. తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేడు మధ్యాహ్నం గ్రామ సమీపంలో వరి చేనులకు వాడే నూతనంగా వచ్చిన నానో యూరియా తాగినట్లు ఆత్మహత్య యత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వెంబడే కిషోర్ కుమార్ రెడ్డి ని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సిఐ శివకుమార్, అమరచింత ఎస్సై స్వాతి ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడి వైద్యులు ప్రాణాపాయం తప్పిందని అబ్జర్వేషన్‌లో ఉంచుతున్నట్లు వెల్లడించారు. పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

## సర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి : మెట్టు శ్రీనివాస్

**- బీఎల్ఏలకు దిశానిర్దేశం చేసిన ఇంతియాజ్ ఇసాక్**



**వనపర్తి రూరల్, జూలై 06, (జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి అర్హ ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్ సూచించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయన స్వగృహంలో సోమవారం నిర్వహించిన బీఎల్ఏల సమావేశంలో మెట్టు శ్రీనివాస్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ పాల్గొని పట్టణంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను సమీక్షించారు. బీఎల్ఏలకు ఎదురవుతున్న సందేహాలను నివృత్తి చేస్తూ ఓటరు నమోదు, మార్పులు, సవరణల విధానంపై సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ ఇసాక్ మాట్లాడుతూ..., క్రమశిక్షణతో పనిచేసే పార్టీ కార్యకర్తలు అదే పట్టుదలతో ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని ఒక్క ఓటు కూడా కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ, గందరగోళానికి తావు ఇవ్వకుండా నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పర్యవేక్షించాలని, ప్రతి అర్హ ఓటరు హక్కు పరిరక్షణకు బీఎల్ఏలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్ అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్రం

**- నిలిచిన నిర్మాణ పనులు**

**- పట్టించుకోని అధికారులు,పాలకులు**

**- సీపీఐ మండల సహాయ కార్యదర్శి భాస్కర్ రెడ్డి**






**చేర్యాల, జులై 06 (జనంసాక్షి) :** చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర నిర్మాణ పనులు సంవత్సరం నుండి పనులు నిలిచిపోయాయని సిపిఐ సహాయ మండల కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మాణ పనులు ప్రారంభంలో వేగవంతం చేసినప్పటికీ గత సంవత్సరం నుంచి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఆరోగ్య ఉప కేంద్ర భవనం నిరుపయోగంగా ఉపయోగం లేకుండా ప్రారంభించక ముందే శిథిలావ్యవస్థకు చేరిందని కత్తుల భాస్కర్ రెడ్డి అన్నారు. 20 లక్షలు కేటాయించినప్పటికీ నిధులు సరిపోక నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా గాలికి వదిలేసారని అన్నారు. ఆరోగ్య ఉప కేంద్రానికి అవసరమాకు నిధులు కేటాయించి అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాలు భవన నిర్మాణ పనులు ఆట కెక్కయనిఅన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రానికి నిధులు కేటాయించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

# పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు



**చేర్యాల, జూలై 06 (జనంసాక్షి) :** తెల్ల రకం పశువులైన ఎడ్లు, ఆవులకు ముద్ద చర్మవ్యాధి ఎల్ ఎస్ డి నిరోధక టీకాలను కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి జి. కృష్ణమూర్తి సందర్శించి టీకాలు వేశారు. సోమవారం చేర్యాల మండలంలోని తెల్ల పశువులన్నింటికీ ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాధి వల్ల చర్మం పైన పొక్కులు, దద్దుర్లు వచ్చి జ్వరం బారిన పడతాయని ఈ వ్యాధి వైరస్ వల్ల వస్తుందని తెలిపారు. రైతులు అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ జె. రాజిరెడ్డి, ఎన్. సిద్దయ్య, ఎల్ ఎస్ ఏ షకీల్, గోపాలమిత్ర సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగిరత్నమాల

**- మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల ఫిర్యాదులు**

**- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ**



**కల్వకుర్తి,జూలై 6,(జనంసాక్షి):** కల్వకుర్తి పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమెతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ నాజియా మక్బూల్ పాల్గొన్నారు. తనిఖీ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన చైర్‌పర్సన్‌కు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందడం లేదని, నాణ్యత విషయంలో కూడా కొన్ని సమస్యలు ఉన్నాయని విద్యార్థులు వివరించారు. భోజన తయారీ సిబ్బంది వ్యవహార శైలివల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ నాజియా మక్బూల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలలో చదివే ప్రతి విద్యార్థి జాతీయస్థాయిలో రాణించాలి

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**బిజినేపల్లి, జులై 6 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అత్యున్నత విద్యా అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞానం, సాధారణ జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. సోమవారం ఉదయం బీజినపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న విద్యా బోధన, విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్వహణ, విద్యా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. ఒక్కో తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును నిశితంగా గమనించడంతో పాటు విద్యార్థులతో నేరుగా సంభాషించి వారి విద్యా ప్రగతి, అవగాహన, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎలాంటి హడావుడి లేకుండా నేరుగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ ముందుగా 12వ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్ నిర్వహిస్తున్న బోధనను పరిశీలించారు.

అనంతరం బయాలజీ ప్రయోగశాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ ఉన్న పరికరాలు, నమూనాలు, ప్రయోగ సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ప్రయోగశాలలో కొంత సమయం గడిపి బయాలజీ సబ్జెక్టులోని పలు ముఖ్యమైన అంశాలను కలెక్టర్ స్వయంగా బోధించారు. జీవశాస్త్రంలో ప్రతి అంశాన్ని కేవలం చదవడమే కాకుండా ప్రయోగాత్మకంగా అర్థం చేసుకోవడం ద్వారా విజ్ఞానం మరింత పెరుగుతుందని వివరించారు.

అలాగే పంజాబ్‌లో భాంగ్రా, గుజరాత్‌లో గర్బా, రాజస్థాన్‌లో ఘూమర్, తెలంగాణలో లంబాడి తదితర జానపద నృత్యాల ప్రత్యేకతలను వివరించి భారతదేశ సంస్కృతిలోని వైవిధ్యాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా జిల్లా కలెక్టర్ వివరించారు. విద్య అంటే కేవలం పుస్తక విజ్ఞానం మాత్రమే కాదని, దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సూచించారు. ప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు దేశంలోనే అత్యుత్తమ విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని కలెక్టర్ తెలిపారు.

అలాంటి అరుదైన అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. హాస్టల్, భోజనం, గ్రంథాలయం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు వంటి అన్ని వనరులను సమర్థంగా వినియోగించుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, రక్షణ రంగ అధికారులు, పరిశోధకులు వంటి అత్యున్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రేరణనిచ్చారు.

విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమ, మంచి విలువలను అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులను గౌరవిస్తూ ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నవోదయ విద్యాలయానికి, నాగర్‌కర్నూల్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రతి విద్యార్థి తన ప్రతిభతో దేశం గర్వించే పౌరుడిగా ఎదగాలని, భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే బాధ్యతగల వ్యక్తిగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

పాఠశాలలోని చేపట్టిన రిపేర్ల పనిని, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, ప్రయోగశాలలు, తరగతి గదులు, హాస్టల్, భోజనశాల తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి ప్రతిభను వెలికితీయాలని, నవోదయ విద్యాలయాన్ని విద్యారంగంలో మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో గదుల కొరతపై ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు ఈనెల చివరి నాటికి మరోసారి సందర్శించి వాటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో గంటన్నర సమయాన్ని విద్యార్థులతో కలెక్టర్ గడిపారు.

జిల్లా కలెక్టర్ వెంట బిజినపల్లి మండల తహశీల్దార్ మునీరుద్దీన్, నవోదయ ప్రిన్సిపల్ డి పూర్ణిమ, నవోదయ హిస్టరీ సీనియర్ ఉపాధ్యాయుడు భాస్కరాచారి, ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయుల బృందం, తదితరులు ఉన్నారు.

# ఎస్ఐఆర్ పై అప్రమత్తంగా ఉండండి..





మినీ ఇండియాగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం మూలంగా ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశంలోని 28 రాష్ట్రాల ప్రజలు నియోజకవర్గంలో నివాసం ఏర్పరచుకొని తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని.. వీరి ఓటు హక్కు అంశం ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నియమించిన బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆశించిన మేరకు పనిచేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ తరపున నియమించబడిన బూతు లెవల్ ఏజెంట్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఓటరుకి ఎస్ఐఆర్ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి.. తమ వివరాలు నమోదు చేయించుకునేలా కృషి చేయాలని సూచించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో బిఆర్ఎస్ ఓట్లను తొలగించాలన్న కుట్రతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నియోజకవర్గంలో 70 వేల ఓట్లు తొలగించి.. ఆమెను ఓడించారని గుర్తు చేశారు.

పటాన్చెరు నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిది డివిజన్లో ఉన్నాయని.. రాబోయే బల్దియా ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయాలంటే ప్రతి ఓటును రక్షించుకోవాల్సిన ఆవశ్యకత కార్యకర్తలపై ఉందని తెలిపారు.. రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్లకు స్థానికంగానే ఓటు ఉంచుకునేలా సూచించాలని కోరారు. ఈ అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 12వ తేదీన పటాన్చెరులో మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఏలు భారీ సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేనున్నా... మీకు అన్నలా..



## అభివృద్ధే అజెండాగా మేఘారెడ్డి

- రూ.1,000 కోట్ల అభివృద్ధి పనులతో వనపర్తికి కొత్త రూపు
- విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధిపై ప్రత్యేక దృష్టి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సొంత ఖర్చుతో కొత్త వస్త్రాల పంపిణీ
- ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో చొరవ



**వనపర్తి బ్యూరో, జూలై 6 (జనం సాక్షి):**

ఒక ప్రజాప్రతినిధి విజయాన్ని కేవలం ఎన్నికల ఫలితాలతో మాత్రమే కొలవలేమని, ప్రజల జీవితాల్లో ఎంతటి మార్పు తీసుకొచ్చాడు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎంత సమర్ధవంతంగా అమలు చేశాడు అనేదే నిజమైన నాయకత్వానికి ప్రమాణమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చర్యలు నిరూపిస్తున్నాయి. ప్రజల అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు.

వనపర్తి నియోజకవర్గం గతంతో పోలిస్తే నేడు వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా సంస్థల అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు వంటి అనేక రంగాల్లో సమగ్ర అభివృద్ధి కనిపిస్తోంది. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేస్తూ అవసరమైన నిధులను తీసుకురావడంలో ఎమ్మెల్యే చూపుతున్న చొరవ ఫలితంగానే ఇప్పటికే వంద కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి.

విద్యకు, క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఆధునిక తరగతి గదులు, పరిశుభ్రమైన వాతావరణం, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల అభివృద్ధికి కృషి కొనసాగుతోంది. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సాహం అందిస్తున్నారు. యువతకు పోటీ పరీక్షలపై అవగాహన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని కార్యరూపంలో చూపిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేందుకు అవసరమైన సదుపాయాల కల్పన, తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యువతకు ఉపాధి కల్పన అనేది కేవలం హామీలకు పరిమితం కాకుండా పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్వయం ఉపాధి సంఘాలు, మహిళా సంఘాలకు అవసరమైన సహకారం అందిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయమే వనపర్తి ప్రాంత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని భావిస్తూ సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, తాగునీరు - సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గృహప్రవేశ సందర్భంగా తన సొంత ఖర్చులతో కొత్త వస్త్రాలను అందజేయడం మేఘారెడ్డి మానవీయతకు నిదర్శనం.

ప్రజల సమస్యలు వినడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. గ్రామాల పర్యటనలు, ప్రజా దర్శనాలు, అధికారులతో సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలనలు నిరంతరం కొనసాగిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వనపర్తిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ప్రణాళికలు కొనసాగుతున్నాయి. ప్రజల అభ్యున్నతే పరమావధిగా, అభివృద్ధే లక్ష్యంగా, సేవే సిద్ధాంతంగా ముందుకు సాగుతున్న నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుచుకుంటోంది.

### విద్య, క్రీడలకు ప్రాధాన్యం

విద్య బలోపేతం లేని అభివృద్ధి అసంపూర్ణమని భావించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఆధునిక తరగతి గదులు, పరిశుభ్ర వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సాహం అందిస్తూ, యువతకు పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు.

### 1000 కోట్లతో సమగ్ర అభివృద్ధి

గతంతో పోలిస్తే వనపర్తి నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధి పథంలో వేగంగా పయనిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళు, డ్రైనేజీ వ్యవస్థలు వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి కనిపిస్తోంది. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ఎమ్మెల్యే మేఘారెడ్డి చూపిన చొరవ వల్ల ఇప్పటికే రూ. 1000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ పనులు కేవలం నిర్మాణాలకు పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తున్నాయి.

### వైద్యం, ఉపాధి, రైతు సంక్షేమం

ఆరోగ్యమే మహాభాగ్యమని కార్యరూపంలో చూపుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం, తల్లీబిడ్డల ఆరోగ్యం, అత్యవసర సేవలు బలోపేతం చేస్తున్నారు. పేదలు వైద్య ఖర్చులతో ఇబ్బంది పడకుండా ఆరోగ్య పథకాలు సమర్ధవంతంగా అమలు చేస్తున్నారు.యువతకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహిస్తున్నారు. స్వయం సహాయక సంఘాలు, మహిళా, యువజన సంఘాలకు సహకారం అందిస్తూ గ్రామీణ యువత స్వగ్రామాల్లోనే ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయానికి వెన్నెముకగా ఉన్న రైతుల సంక్షేమం కోసం సాగునీటి వనరుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు వేగంగా చేపట్టారు. ప్రతి ఎకరాకు నీరు అందాలనే లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు తీసుకురావడం, రైతులకు మౌలిక వసతులు కల్పించడం కొనసాగుతోంది.







